

గణపయ్యా.. రావయ్యా..!


పత్రి కొనుగోలుకు రద్దీ

- నేటి నుంచి గణేష్ నవరాత్రులు
- వాడవాడలా ముస్తాబైన మండపాలు
- ఊరేగింపుగా విగ్రహాల తరలింపు
- ఆకట్టుకుంటున్న విభిన్న రూపాల ప్రతిమలు
- పూజా సామగ్రి కొనుగోలులో భక్తులు బిజీ

జిల్లావ్యాప్తంగా చవితి శోభ నెలకొంది. గణేశుడి నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. వాడవాడలా మండపాలు ముస్తాబయ్యాయి. వినాయక చవితిని బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. భిన్నరూపాల్లో ఉన్న గణనాథుడి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భారీ లైటింగ్‌లు, ఆకట్టుకునే సెట్టింగ్‌ల మధ్య మండపాల్లో కొలువుదీర్చారు. మంగళవారం ఉదయం నుంచే భక్తులు పూజా సామగ్రి, పూలు, పత్రి కొనుగోలు చేశారు. పర్యావరణ ప్రేమికులు మాత్రం మట్టి గణపతే మహా గణపతి అంటున్నారు. అయితే నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు ప్రజలను కోరారు. వివరాలు 9లో..


మట్టి గణపతి కొనుగోళ్లు

ఉద్యమాలు మరింత ఉధృతం

- సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : రానున్న కాలంలో పేదల పక్షాన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఒంగోలులో మూడు రోజులపాటు నిర్వహించిన సీపీఐ రాష్ట్ర మహాసభలు ముగిసిన నేపథ్యంలో ఆయన మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల్లో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై 62 తీర్మానాలు ప్రవేశపెట్టామన్నారు. వీటిని మహాసభల ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల చొప్పున మిగతా 8లో...

సహకార శాఖలో ఉద్యోగోన్నతులు

- ఇద్దరు డీఆర్‌లుగా నియామకం

ఒంగోలు విద్య, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార శాఖలో పనిచేస్తున్న పలువురికి ఉద్యోగోన్నతులు లభించాయి. ఈమేరకు రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా పనిచేస్తున్న ఇరువురికి డివిజనల్ సహకారాధికారులు (డిప్యూటీ రిస్ట్రార్లు)గా ఉద్యోగోన్నతి కల్పించారు. పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బీవీఎన్ కృష్ణశాస్త్రిని గూడూరు డివిజనల్ సహకారాధికారిగా నియమించారు. పొదిలి సబ్ డివిజనల్ సహకారాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లును నెల్లూరు జిల్లా డివిజనల్ సహకారాధికారిగా నియమించారు. ఒంగోలు మిగతా 8లో...

ఎరువుల దుకాణాలపై
ముప్పేట దాడులు

ఎరువుల అక్రమ నిల్వలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. జిల్లావ్యాప్తంగా దుకాణాలపై ముప్పేట దాడులు చేపట్టింది. రెండురోజులుగా అక్కడక్కడా తనిఖీలు చేయగా.. మంగళవారం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహించింది. వ్యవసాయ, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు విడివిడిగా ఈ ప్రక్రియను చేపట్టారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ స్వయంగా రంగంలోకి దిగారు. ఆయన కొత్తపట్నంలోని దుకాణాలను తనిఖీ చేశారు. ఇతర ప్రాంతాల్లో మండల, సబ్ డివిజనల్ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల అక్రమ నిల్వలు వెలుగు చూశాయి.

- జిల్లావ్యాప్తంగా వ్యవసాయ, రెవెన్యూ, విజిలెన్స్ అధికారుల ముమ్మర తనిఖీలు
- కొత్తపట్నంలో పాల్గొన్న జేసీ
- పలుచోట్ల వెలుగు చూసిన అక్రమాలు


కొత్తపట్నంలో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ, డీఏవో శ్రీనివాసరావు

ఒంగోలు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. దీంతో పలుచోట్ల వ్యాపారులు ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వాటిని అధిక ధరలకు అమ్మి రైతుల జేబులను లూటీ చేస్తున్నారు. ప్రధానంగా యూరియా విషయంలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలకు ఆదేశించింది. ఈనేపథ్యంలో జిల్లాలో అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. ప్రస్తుతం దర్శి, త్రిపురాంతకంలో సాగర్ నీటి రాకతో వరి సాగుకు రైతులు ఉపక్రమించారు. పశ్చిమప్రాంతంలో మెట్ట పంటలు సాగు చేశారు. దీంతో ఆ ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో తనిఖీలు చేపట్టారు. దర్శి, ముండ్లమూరు, పొదిలి, ఇతర పలు ప్రాంతాల్లో అక్రమ నిల్వలు వెలుగు చూశాయి.

విస్తృత తనిఖీలు

జిల్లావ్యాప్తంగా మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేశారు. పలుచోట్ల అక్రమ నిల్వలు బయటపడ్డాయి. మండల కేంద్రమైన కొత్తపట్నంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి జేసీ గోపాలకృష్ణ తనిఖీలు చేశారు. అక్కడి శివాలయం వీధిలోని దుకాణంలో రూ.2.87 లక్షల విలువైన 4.86 టన్నుల యూరియాను సీజ్ చేసి 6(ఏ) కేసు నమోదు చేశారు. కనిగిరిలో ఆర్డీవో తనిఖీలు చేపట్టగా మార్కాపురంలో తహసీల్దార్ మిగతా 8లో...

బార్‌ల లైసెన్స్ దరఖాస్తుకు
గడువు పెంపు

- ఈనెల 29 వరకు స్వీకరణ... 30న లాటరీ
- జిల్లాలో 26 బార్‌లకు 17 అప్లికేషన్లు
- ఒంగోలులో యజమానులు సిండికేట్



ఒంగోలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : బార్‌ల లైసెన్స్‌కు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈనెల 29 వరకూ అవకాశం ఇచ్చింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ప్రకటించిన ప్రకారం మంగళవారంతో గడువు ముగిసింది. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. జిల్లాలో 26 బార్లు ఉండగా కేవలం 17 మాత్రమే వచ్చాయి. అందులో ఒంగోలులోని 16 బార్‌లకు నాలుగు, మార్కాపురంలోని ఐదు బార్‌లకు 4, మిగతా 8లో...

సిబ్బంది సంక్షేమానికి కృషి

- ఎస్పీ దామోదర్
- పోలీసు కుటుంబాలతో సమావేశం

ఒంగోలు క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబాలు, హోంగార్డులు, విశ్రాంత సిబ్బంది కుటుంబ సభ్యులతో ఆయన తన కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సమాజ రక్షణలో ప్రాణాలు అర్పించిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ ఎప్పటికీ మరిచిపోదన్నారు. విధి నిర్వహణలో ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ మురళి భార్య సుధారాణికి ఇన్సిడెంటల్ చార్జెస్ కింద రూ.25వేల చెక్కును ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఏవో విజయ్‌కుమార్, జిల్లా పోలీసు కార్యాలయ సూపరింటెండెంట్‌లు సంధాని, డిశైలజ, సిబ్బంది పాల్గొన్నారు.


పుల్లలచెరువులో గతంలో ఆగిపోయిన బాలికల వసతిగృహానికి రూ.40లక్షలతో జరుగుతున్న పనులు

సమస్యలకు చెక్.. హాస్టళ్లకు కొత్త లుక్

- విద్యార్థులకు వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ
- రూ.14కోట్లతో భవనాల ఆధునికీకరణ
- రూపుమారుతున్న వసతి గృహాలు
- ప్రజా ప్రభుత్వ పాలనలో తీరుతున్న బాధలు

త్రిపురాంతకం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల నాడు - నేడు పథకం అంటూ ఊకదంపుడు ప్రచారం చేసుకున్న వైసీపీ పాలకులు విద్యార్థుల వసతి సమస్యలను గాలికొదిలేశారు. చాలీచాలని గదులు, కంపుకొడుతున్న మరుగుదొడ్లు, నీళ్లరాని కొళాయిలు, పగిలిపోయిన బండలు, కుంగిన నేలలు.. వెరసి విద్యార్థులు అనేక సమస్యల మధ్య చదువులు సాగించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే తమది మాటల సర్కారు కాదని.. చేతలదని రుజువు చేస్తూ సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పన కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రస్తుతం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని సంక్షేమ వసతి గృహాల రూపురేఖలను మార్చడం ప్రారంభించింది. శరవేగంగా పనులు జరుగుతు న్నాయి. దీంతో విద్యార్థుల కష్టాలకు చెక్ పడి హాస్టళ్లకు కొత్త లుక్ వస్తోంది.

నియోజకవర్గానికి రూ.14 కోట్లు మంజూరు

కొన్ని నెలల క్రితం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్ని మండలాల్లో వసతి గృహాల పరిస్థితిని మిగతా 8లో...

ఆక్రమణలు ఆపేవారేరి?

ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమణదారులు వాలిపోతున్నారు. విచ్చలవిడిగా నిర్మాణాలు చేపట్టి సొంతం చేసుకుంటున్నారు. మరికొందరు సేవా కార్యక్రమాల పేరుతో ప్రభుత్వ స్థలాలను చేజిక్కించుకుని ఎంచక్కా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇలా దర్శిలో కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆర్థిక దన్ను, అధికార బలం చూసుకుని కొందరు అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తాయిలాలకు తలొగ్గుతున్నారు.

- దర్శిలో విచ్చలవిడిగా ఖాళీ స్థలాల కబ్జా
- వాటిలో యథేచ్ఛగా పక్కా నిర్మాణాలు
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం


ఎన్ఎస్‌పీ స్థలంలో ఏర్పాటుచేసిన చిల్డ్రన్స్ పార్క్

దర్శి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దర్శి-కురిచేడు రోడ్డులో ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ స్థలాన్ని ఆక్రమించి ఓ బడా వ్యాపారి మినీ స్విమ్మింగ్‌పూల్ నిర్మించాడు. ఒంగోలు బ్రాంచ్ కాలువ పక్కన ఉన్న ఎన్ఎస్‌పీ స్థలాన్ని ఆక్రమించి చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటుచేశాడు. ఆ వ్యాపారి ఉచితంగా చిన్నారులకు ఈ సదుపాయాలు కల్పించేందుకే స్విమ్మింగ్ పూల్, చిల్డ్రన్స్‌పార్క్ ఏర్పాటుచేశామని చెబుతున్నాడు. అక్కడ సెంట్ ధర రూ.20 లక్షలు ఉంది. సుమారు 20 సెంట్లు ఆర్అండ్‌బీ భూమిని, 40 సెంట్లు ఎన్ఎస్‌పీ స్థలాన్ని ఆక్రమించి ఉచితం పేరుతో కోట్లాది రూపాయల స్థలాన్ని వినియోగించుకుంటున్నాడు. అక్కడ డెయిరీ ఉత్పత్తులను విక్రయిస్తూ నిత్యం వేలాది రూపాయల వ్యాపారం చేస్తున్నాడు. ఏళ్ల తరబడి ఈతంతు కొనసాగుతున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు కానీ, ఇరిగేషన్ అధికారులు కానీ పట్టించుకోలేదు.

వైసీపీ హయాంలో ఇలా..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మిగతా 8లో...

దొడ్డంపల్లిలో ఘర్షణ

- ఇరు వర్గాల పరస్పర దాడులు
- తొమ్మిది మందికి గాయాలు
- 21 మందిపై కేసు నమోదు
- వినాయకుడి ఊరేగింపులో ఘటన

9

ప్రభుత్వ స్థలంలో వైసీపీ నేత పాగా!

- పంచాయతీ అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు
- ఆక్రమించి నిర్మించిన షాపుల తొలగింపు
- అడ్డుకునేందుకు యత్నించిన ఆక్రమణదారుడు

9


ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఎరువుల దుకాణాలపై ముప్పేట దాడి

(7వపేజీ తరువాయి)
చిరంజీవి, స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. పామూరు, దోర్నాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. గిద్దలూరులో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, తర్లుబాడులో తహసీల్దార్ కిషోర్‌కుమార్, రాచర్ల, కేకేమిట్లలో వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా సోదాలు చేశారు. కేకేమిట్లలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2.67లక్షలు, దోర్నాలలో రూ.4.22 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేశారు. జిల్లాలోని పలు ఇతర ప్రాంతాల్లోనూ ముమ్మరంగా దాడులు జరిగాయి. పొదిలిలో సోమవారం సుమారు రూ.20 లక్షల విలువైన 17వందల బస్తాలకు పైగా ఎరువులను సీజ్ చేశారు. మంగళవారం రూ.31,900 విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు.

ఉద్యమాలు మరింత ఉధృతం

(7వపేజీ తరువాయి)
నివేశన స్థలాలతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు.. లేనిపక్షంలో పేదల పక్షాన సీపీఐ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పలు విమర్శలు చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని అనుసరిస్తూ పేదలపై భారం మోపుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈనెల 28న కలిసొచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమం చేస్తామన్నారు. సుపరిపాలన, డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌లో ఎరువులను సక్రమంగా అందించడంలో విఫలమైందని విమర్శించారు. యుద్ధ ప్రాతిపదికన ఎరువుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సహకారశాఖలో ఉద్యోగోన్నతులు

(7వపేజీ తరువాయి)
ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో పని చేస్తున్న జేబీఎన్ కుమార్‌ను ఒంగోలు డీసీవో కార్యాలయంలో ఏఆర్‌గా బదిలీ చేశారు. చీరాల ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో పనిచేస్తున్న టి.మారుతిబాబును ఒంగోలు ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో ఏఆర్‌గా నియమించారు. కందుకూరు డీఎల్‌సీవో కార్యాలయంలో పనిచేస్తున్న బి.మాధురిని నెల్లూరు డీసీఎల్‌వో కార్యాలయంలో ఏఆర్‌గా, చీరాల ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో పనిచేస్తున్న కేవీ రమణయ్యను అద్దంకి ఎస్‌డీఎల్‌సీవో కార్యాలయంలో ఏఆర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

బార్ లైసెన్సుల దరఖాస్తుకు గడువు పెంపు

(7వపేజీ తరువాయి)
చీమకుర్తిలో ఒక్క బార్‌కు 5 ఉన్నాయి. పొదిలి, దర్శి, కనిగిరి, గిద్దలూరులలో ఒక్కో బార్‌కు ఒక్కో దరఖాస్తు మాత్రమే అందింది. దీంతో ప్రభుత్వం గడువు పెంచింది. బార్‌కు 4 దరఖాస్తులలోపు వస్తే దరఖాస్తు ఫీజు వెనక్కి ఇస్తామని ప్రకటించింది.

బార్ల యజమానులు సిండికేట్

ఒంగోలులో 16 బార్లు ఉండగా కేవలం నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కొత్త పాలసీయే ఇందుకు కారణమైంది. ప్రస్తుతం ప్రభుత్వం గడువుపెంచడంతో పునరాలోచనలో పడ్డారు. నగరంలోని బార్‌ల నిర్వాహకులంతా కూడబలుక్కొని ఒక్కో బార్‌కు ఒక్కరే నాలుగు దరఖాస్తులు దాఖలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఆ ప్రకారం బార్ లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు, నాలుగు దరఖాస్తులకు ఒక్కోదాని ఫీజు రూ.5లక్షల చొప్పున రూ.20లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఆ ప్రకారం ఏడాదికి రూ.75లక్షలు కట్టాల్సి వస్తుంది.

ధర రూ. 266.. అమ్ముతోంది రూ.300

కొత్తపట్నంలో యూరియా విక్రయాల్లో వ్యాపారుల ఇష్టారాజ్యం
జేసీ తనిఖీల్లో బహిర్గతం
కేసు నమోదు చేసిన అధికారులు


రైతుతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

కొత్తపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : సాగు సమయం ఆసన్నమైంది.. రైతులు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు.. ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి సమయంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు నిలువుదోపిడికీ దిగుతున్నారు. ఎరువులు పురుగుమందుల దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యమైంది. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జేసీ గోపాలకృష్ణ నేరుగా రంగంలోకి దిగారు. మంగళవారం కొత్తపట్నంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో వ్యాపారుల అసలు గుట్టురట్టయ్యింది. యూరియా బస్తా రూ.266కు అమ్మాల్సి ఉండగా రూ.300కు అమ్ముతున్నారు. కొత్తపట్నంలోని శివాలయం వీధిలో ఉన్న షా ఎంటర్‌ప్రైజెస్ దుకాణాన్ని జేసీ తనిఖీ చేశారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యూరియా బస్తా ఎంతకు అమ్ముతున్నారంటూ వాకబు చేశారు. రూ.300లకు విక్రయిస్తున్నారని చెప్పటంతో షా ఎంటర్‌ప్రయిజెస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అంతేగాక దుకాణంలో ఉన్న 4.86 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేశారు. అనంతరం ఆయన రాజుపాలెంలోని బాలాజీ ఏజెన్సీస్‌లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని రైతులతో కూడా జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

వ్యవసాయాధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగులో ఉన్న పంటలకు అవసరమైన ఎరువులు, యూరియా రైతులకు సరిపడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడా యూరియ కొరత ఏర్పడకుండా రైతులకు అవసరమైన మేరకు ఎరువులను వెంటనే అందచేయాలని, కేటాయించిన యూరియా పూర్తిగా స్థానిక రైతులకు అందేలా చూడాలని అన్నారు. ఎరువులు బయటకు మళ్లించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

సమస్యలకు చెక్.. హాస్టళ్లకు కొత్త లుక్!

(7వపేజీ తరువాయి)
తెలుసుకున్నారు. అధికారులతో సమీక్షించి అవసరమైన నిధుల కోసం అంచనాలు రూపొందించాలని సూచించారు. తక్షణమే అధికారుల వైపు నుంచి పనులు చకచకా జరిగిపోయాయి. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లడంతో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో నియోజకవర్గంలోని హాస్టళ్ల ఆధునికీకరణ, మరుగుదొడ్ల మరమ్మతులు, గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కట్టడాలను పూర్తి చేసేందుకు మొత్తం రూ.14కోట్లు మంజూరయ్యాయి. ఎర్రగొండపాలెం మండలంలో రూ.10కోట్ల 94లక్షల 71వేలు, పుల్లలచెరువు మండలంలో రూ.2కోట్ల 47లక్షల 21వేలు, త్రిపురాంతకం మండలంలో రూ.31లక్షలు, దోర్నాల మండలంలో రూ.31లక్షల 20వేలతో పనులు జరుగుతున్నాయి.

హాస్టళ్లకు ఖర్చు చేస్తున్న నిధుల వివరాలు

ఎర్రగొండపాలెంలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి రూ.6కోట్లతో నూతన భవన నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం ఉన్న బాలికల వసతి గృహంలో రూ.40లక్షలతో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. రాజీవ్ విద్యామిషన్ ద్వారా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుసంధానంగా ప్రత్యేకంగా రూ.1.94కోట్లతో మరో బాలికల వసతి గృహం పనులు పూర్తి కావస్తున్నాయి. పుల్లలచెరువులో రాజీవ్ విద్యామిషన్ ద్వారా రూ.1.94కోట్లతో జరుగుతున్న బాలికల వసతి గృహం పనులు చివరి దశకు వచ్చాయి. అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు మళ్లీ ఇప్పుడు రూ.40లక్షలతో పనులు వేగంగా జరుగుతున్నాయి. పుల్లలచెరువు బీసీ బాలుర వసతి గృహానికి రూ.13లక్షలతో మరమ్మతులు పూర్తి చేశారు. త్రిపురాంతకంలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహానికి రూ.23లక్షలు, బీసీ వసతి గృహానికి రూ.8లక్షలతో మరమ్మతులు దాదాపు పూర్తి కావచ్చాయి. దోర్నాలలో సాంఘిక సంక్షేమ వసతి గృహానికి రూ.24లక్షల 20వేలు, బీసీ వసతి గృహానికి రూ.7లక్షలు మంజూరై మరమ్మతు పనులు పూర్తయ్యాయి.

మొక్కుబడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

- కోరం లేక మూడు గంటలు నిలిచిన సమావేశం
- సభ్యులకు ఫోను చేసి పిలిపించిన ఏఎంసీ చైర్మన్

సంతమాగులూరు ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. సమావేశం 11 గంటలకు ఎంపీపీ ఏనుబర్ల యల్లమంద అధ్యక్షతన ప్రారంభం కాగా ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. అయితే ఎంపీడీవో జ్యోతిర్మయితో పాటు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేల్రపోలు రమేష్ హాజరయ్యారు. అయితే సభ్యులు లేకపోవడంతో విస్మయానికి గురై సభ్యుల కోసం ఎదురు చూశారు. సమయం 12:30 అయ్యేసరికి అధికారికంగా సమావేశం ప్రారంభం కాగా, గంటన్నరకు అధ్యక్ష హోదాలో ఎంపీపీ ఉండగా మరో ముగ్గురు ఎంపీటీసీలు చవిటిపాలెం ఎంపీటీసీ సభ్యులు లీలావతి రాధాకృష్ణమూర్తి, సంతమాగులూరు సభ్యుడు పిట్టమడుసుల కాంతారావు, సజ్జాపురం ఎంపీటీసీ శ్రీనివాసరావుతో పాటు కో ఆప్షన్ సభ్యులు షైకంటి మస్తాన్‌వలి (ఉక్కు) సమావేశ మందిరంలోకి వచ్చారు, అయితే మండల పరిషత్ మొత్తం పాలకవర్గ సభ్యులు 17 మంది కాగా, కోఆప్షన్ సభ్యులతో కలిసి మొత్తం 18 మంది, సమావేశం కోరం ఉండాలంటే మూడో వంతు కంటే ఆరుగురు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలి, ఆరవ సభ్యుడు ఎవరు రాకపోవడంతో అటు అధికారులతో పాటు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరైన సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు తేలపోలు రమేష్ కాస్తంత విస్మయానికి గురయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన రమేష్ ఎంపీటీసీలకు సభ్యులకు ఫోన్ చేసి రావాల్సిందిగా కోరారు, మధ్యాహ్నం 1.30 వరకు సమావేశం జరుగుతుందా..? లేదా..? అన్న ఉత్కంఠ నడిచింది. పలువురు అధికారులు సైతం మౌనంగా అక్కడే ఎదురుచూస్తూ కనిపించారు. ఎట్టకేలకు ఎల్లలచెరువు ఎంపీటీసీ సభ్యురాలు సభ్యురాలు మేకల లక్ష్మి సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఆమెతో సంతకాలు చేయించుకుని, కోరం సరిపోవడంతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే మధ్యాహ్న భోజన సమయం మించిపోవడంతో ఎజెండాలు, చర్చలు, ప్రగతి నివేదికలు, ఏమీ లేకుండానే సమావేశాన్ని మమా అనిపించేశారు. సమావేశంలో ఎంపీపీ ఏనుబర్ల ఎలమంద, తహసీల్దార్ కే రవిబాబు, నల్లూరి శివరాం ప్రసాద్, ఏడుగురు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

కార్మికులపై అసిస్టెంట్ మేనేజర్ వేధింపులు మానుకోవాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్మికులను వేధింపులకు గురి చేయడం మానుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అద్దంకి బస్టాండ్ ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ కలెక్షన్లు తక్కువగా వస్తున్నాయని కార్మికులను అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ వేధించడం రోజూ పరిపాటిగా మారిందన్నారు. కార్మికులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారన్నారు. అధికారులు ఇలాంటి వేధింపులు మానుకోవాలన్నారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న ఏడీసీ జయసింహారెడ్డికి ఒంగోలు బదిలీ అయితే రిలీవ్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని, వెంటనే ఏడీసీని రిలీవ్ చేయాన్నారు. డిపోలో ఉన్న సమస్యలను పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. 300 మంది కార్మికులు ఉన్న డిపోలో కనీసం మరుగుదొడ్డి, తాగునీటి వసతులు లేవన్నారు. బస్సుల్లో చార్జింగ్ పాయింట్‌లు కూడా లేవని వీటన్నింటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి డీఏపీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, ఆర్‌టీసీ కార్మికులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

కుందేరు ప్రక్షాళనకు సన్నద్ధం

- జిల్లా వ్యాప్తంగా ఆక్రమణలపై ఇప్పటికే అంచనా
- త్వరలో పరిశీలన..అనంతరం వాటిపై చర్యలు
- అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కుందేరు ఆక్రమణల తొలగింపుపై పాలకులు, అధికారులు సన్నద్ధమయ్యారు. అందుకు సంబంధించి కలెక్టర్ వెంకటమురళీ, ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ తగు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కుందేరు వాగు బాపట్ల మండలంలో 97.20 ఎకరాలు, చీరాల మండలంలో 276.72 ఎకరాలు, వేటపాలెంలో 656.06, చినగంజాంలో 452.98 ఎకరాలు విస్తీరణంలో సహజ సిద్ధంగా విస్తరించింది. తద్వారా తుపాన్, వరదలతో పాటు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కవచంలా ప్రయోజనకరంగా ఉంది. అయితే కాలక్రమేణ వాగు ఆక్రమణలతో బక్కచిక్కింది. ఒక్క చీరాల డివిజన్ పరిధిలోనే సుమారు 143 అనధికార నివాసాలు ఏర్పడ్డాయి. కబ్జా కోరల్లో ఉన్న కుందేరును అభివృద్ధి పరచి భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరంగా ఉండే ఏర్పాట్లపై పాలకులు, అధికారులు కొంతకాలంగా సమాయత్తమయ్యారు. ఈనేపథ్యంలోనే ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి అంచనాకు వచ్చారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే కొండయ్య అధికారులతో సమీక్షించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందించి అంచనాకు రానున్నారు. త్వరలోనే ఆక్రమణలపై చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయండి

చీరాల : నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్లమెంట్, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలపై మాట్లాడారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని వివరించారు. అంతకు ముందు పట్టణంలోని మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాన్యుడిలా ఉండడం ఇష్టం

అవీఇవీ

సినీ నటుడు అజయ్‌ఘోష్


అజయ్ ఘోష్‌తో స్థానికుడు

నాగులుప్పలపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడిలా ఉండటం ఇష్టమని సినీ నటుడు అజయ్ ఘోష్ చెప్పారు. ఒంగోలు నుంచి తన స్వగ్రామం వేటపాలేనికి స్కూటీపై వెళుతున్న నటుడు అజయ్ ఘోష్ మంగళవారం నాగులుప్పలపాడులోని ఓ టీ దుకాణం వద్ద ఆగారు. దాంతో స్థానికులు ఆయనతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా అంటే వినోదం కాదని సమాజానికి సందేశాన్ని అందిస్తాయని చెప్పారు. అలాంటి చిత్రాలు ఎన్నో నటించడం వల్లనే తనకు ఇంత గుర్తింపు లభించిందన్నారు. ఒకప్పుడు థియేటర్లలో విజిల్స్ కొట్టిన తాను ఇప్పుడు వారితోనే నటించడం గర్వంగా ఉందని చెప్పారు. పక్కా కమర్షియల్, రంగస్థలం, పుష్ప లాంటి సినిమాలతో ప్రేక్షకులను ఎంతగానో ఆదరించారన్నారు. ఇప్పటికీ తాను అందరితో కలసి సరదాగా ఉండటం షూటింగ్ లేని సమయంలో స్నేహితులు, బంధువులతో సామాన్యుడిగా మెలగడం ఎంతో ఇష్టమన్నారు.

ఘనంగా జీజీహెచ్ నర్సింగ్ వార్షికోత్సవం


వేడుకలలో పాల్గొన్న నర్సులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కాంట్రాక్ట్, స్టాఫ్ నర్సుల అసోసియేషన్ 5వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు కే శరత్‌బాబు, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు ఉదయలక్ష్మి, జనరల్ సెక్రటరీ కొత్తపల్లి మంజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడం సేవగా భావించాలన్నారు. విధుల నిర్వహణలో ఐక్యతతో మెలగాలని, సంఘం మరింత బలోపేతం అయి, హక్కులు సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సుమన్, జోయెల్, నర్సింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సబ్ ప్లాన్‌ను సమర్థంగా అమలు చేయాలి


మాట్లాడుతున్న దేవకుమార్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎస్ఓపీని క్షుణ్ణంగా అర్థం చేసుకుని దళిత గిరిజనుల సంఘ నాయకులు పనిచేయాలని తెలిపారు. సబ్ ప్లాన్ నిధుల ద్వారా దళిత, గిరిజనుల నివాస ప్రాంతాలు, కుటుంబం, వ్యక్తి అభివృద్ధికి కృషి చేయాలని చట్టం చెబుతుందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ సిటిజన్ ఆడిట్ నివేదిక ప్రకారం, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల అత్యాచారాల నివారణకు ఈ చట్టం వచ్చిందని చెప్పారు. సమావేశంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళ కో ఆర్డినేటర్ ఎం. హేమలత, బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్ గురజాల రాజేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రఘురామ్, పలు సంఘాల నాయకులు గుంటూరు నాగమణి, గుమ్మళ్ల నరసింహారావు, పేరయ్య, దాసరి సుందరం, బిల్లా శరత్, ఏలియా పాల్గొన్నారు.

టీచర్లకు ఉద్యోగోన్నతి పత్రాల అందజేత


నియామక పత్రం అందుకుంటున్న టీచర్

ఒంగోలు విద్య, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ మంగళవారం స్థానిక సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఆరుగురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. డీఈవో కిరణ్‌కుమార్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్, ఏడీ వరప్రసాదు పాల్గొన్నారు.

ఆక్రమణలు ఆపేవారేరి?

(7వపేజీ తరువాయి)
ఆక్రమణలను గుర్తించేందుకు ఇరిగేషన్ అధికారులు వెళ్లగా కొందరు వారిపై దాడిచేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఆక్రమణదారులు అధికార పార్టీ మద్దతుదారులు కావటంతో ఇరిగేషన్ అధికారులు ఏమీచేయలేక వెనుదిరిగి వెళ్లారు.

- దర్శి-కురిచేడు రోడ్డులోని బండి దారి పూర్తిగా ఆక్రమణకు గురైంది. బ్రిటీష్ పాలకుల హయాంలో దిగువన ఉన్న పొలాల దారి కోసం వంద అడుగుల వెడల్పుతో బండిదారిని విడగొట్టారు. అక్కడ సెంటు రూ.5 లక్షలకుపైగా ధర పలుకుతోంది. సుమారు పది ఎకరాల బండి దారి స్థలం ఉండగా 90శాతం ఆక్రమణలకు గురైంది. ఒక ప్రైవేట్ కళాశాల అధినేత సుమారు ఎకరం స్థలాన్ని తన సొంత స్థలంలో కలుపుకొని కళాశాల నిర్మించుకున్నాడు. ఏళ్ల తరబడి బండిదారి స్థలం కళాశాలలో మిళితమై ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. అదే అదనుగా మరికొంతమంది మిగిలిన బండిదారి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. అంతకుముందు 60 శాతానికిపైగా ఖాళీగా ఉన్న బండిదారి స్థలం వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ నిర్మాణాలతో 90శాతం కబ్జా అయింది. కింది పొలాల రైతులు బండిదారి స్థలం ఆక్రమణలను తొలగించాలని జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేయగా మూడేళ్ల క్రితం కొలతలు వేసి ఆక్రమణలకు మార్కింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఏం జరిగిందో కాని అక్రమ నిర్మాణాలను తొలగించలేదు. ఆక్రమణదారులు అధికారులు ఇచ్చిన మార్కింగ్ కూడా తుడిపేశారు.
- దర్శి-పొదిలి రోడ్డులోని వంద ఎకరాల విస్తీర్ణంలోని కాటేరు వాగు 90శాతం ఆక్రమణలకు గురైంది. వర్షం పడినప్పుడు వాగులోకి చేరిన నీరు ముందుకుపోయే వీలులేక రోడ్లపైనే నిల్వ ఉంటుంది. ఇంత జరుగుతున్నా అధికారులు అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఊరంతా సందళ్లు.. పందిళ్లు

నేటి నుంచి వినాయక చవితి నవరాత్రులు ప్రారంభం

21 పత్రాలు.. ఆరోగ్య సూత్రాలు..

విఘ్నేశ్వరుడిని 21 రకాల పత్రాలతో పూజిస్తారు. అవన్నీ ఆరోగ్య ప్రదాయమే అని పెద్దలు అంటున్నారు. ప్రధానంగా మాచీపత్రం, బృహతీపత్రం, బిల్వ పత్రం, దూర్వాయియుగ్మం(గరిక), దత్తూర పత్రం, బదరీ పత్రం, అపామార్గ పత్రం, తులసీ, చూతపత్రం(మామిడి), కరవీర పత్రం, విష్ణు క్రాంత పత్రం, దాడిమి పత్రం, దేవదారు పత్రం, మరువక పత్రం, సింధూ వార పత్రం, జాజి పత్రం, గండకీ పత్రం, శమీపత్రం, అశ్వత్థ పత్రం, అర్జున పత్రం, అర్కపత్రం (జిల్లేడు) ఉపయోగిస్తారు. సాధారణ రోజుల్లో వీటిని పెద్దగా పట్టించుకోని భక్తులు వినాయక చవితి పండుగ రోజు తప్పనిసరిగా ఉపయోగిస్తారు. దీంతో పత్రికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఈ 21 పత్రాలు ఇళ్లలో పూజ చేసుకునే వారికి రూ.150లకే అమ్ముతుండగా, ఇక వీధుల్లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాల వద్ద ఏర్పాటు చేసే పత్రి రూ.500 నుంచి రూ. 1000 వరకు అమ్మకాలు జరుపుతున్నారు.



మట్టి ప్రతిమలను తీసుకెళ్తున్న మహిళ



ఒంగోలు నగరంలో పత్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలు

ఆకర్షిస్తున్న విఘ్నేశ్వర విగ్రహాలు

పెరుగుతున్న పర్యావరణ ప్రేమికులు

మట్టి గణపతికి జై కొడుతున్న జనం

ఒంగోలు ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో, పట్టణాల్లో వినాయక చవితి పండుగ సందడి మొదలైంది. స్వామి మండపాలతోపాటు భక్తిపాటలతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు మండపాలను ముందే సిద్ధం చేశారు. ప్రధాన వీధుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను ఏర్పాటు చేయగా, ఇళ్లలో పూజకు పర్యావరణ హితం కోరుతూ మట్టి గణపతికి జై కొడుతున్నారు. దీంతో 21 పత్రాలతో పూజించేందుకు పత్రిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో వీధులన్నీ రద్దీగా మారాయి.

మండపాల్లో భారీ సెట్టింగ్‌లు

చలువ పందిళ్లు.. భారీ లైటింగ్‌లు, ఆకట్టుకునే సెట్టింగ్‌ల మధ్య గణనాథుడు కొలువుదీరాడు. ఇదిలా ఉండగా పలు ప్రాంతాల్లో నిర్వహణ కమిటీలు భారీ విగ్రహాలను ఏర్పాటు చేయగా, పర్యావరణ ప్రేమికులు మాత్రం మట్టి గణపతే మహా గణపతి అంటున్నారు. రంగు రంగుల విగ్రహాలను వదిలి మట్టి గణపతుల వైపు జనం ఆసక్తి చూపుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరగా, భక్తుల ఆలోచనలు గుర్తించిన పలువురు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ప్రధానంగా వీధుల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో పీఓపీతో చేసిన విగ్రహాలను ఏర్పాటు చేయగా, ఇళ్లలో, అపార్ట్‌మెంట్‌లలో మాత్రం మట్టి విగ్రహాలకు జైకొడుతున్నారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా మార్కెట్‌లో మంగళవారం రాత్రి పండుగ సందడి నెలకొంది. అవసరమైన పత్రి కొనుగోళ్లతో వీధులన్నీ కిటకిటలాడుతున్నాయి.



మట్టి గణపతికి జై...

ప్రకృతి పండుగ అయిన వినాయకచవితిని మట్టి ప్రతిమలతో జరుపుకునేందుకు పర్యావరణ ప్రేమికులు ఆసక్తి చూపుతున్నారు. పర్యావరణానికి హాని చేకూర్చే పీఓపీ ప్రతిమలు ఏర్పాటు చేయవద్దని చెబుతూ మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పూజించాలని వివిధ స్వచ్ఛంద సంస్థలు, సమాజ సేవకులు అవగాహన కల్పిస్తూ వాటిని పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు ఒంగోలు నగరంలో పలు ప్రాంతాల్లో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



కంభం పురవీధులలో ఇస్కాన్ బృందం పాదయాత్ర

వైభవంగా ఇస్కాన్ బృందం పాదయాత్ర

కంభం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణానికి మంగళవారం ఇస్కాన్ సంపూర్ణ భారత పాదయాత్ర బృందం వచ్చింది. ఈ బృందానికి కంభం ప్రజలు హిందూ దేవాలయాల పెద్దలు, హిందూ సంఘాల పెద్దలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఇస్కాన్ బృదం భారతదేశమంతటా 6 సార్లు పాదయాత్ర చేసి 6వ సారి కేదారనాథ్, బదరీనాథ్, ద్వారక, పూరి, శ్రీకూర్మం, మంగళగిరి, గుంటూరు, పొదిలి, మార్కాపురం మీదుగా కంభానికి చేరుకున్నట్లు చెప్పారు. బుధవారం కంభం మీదుగా గిద్దలూరు, అహోబిళం, తిరుపతి, రామేశ్వరం వెళ్తున్నట్లు తెలిపారు. మంగళవారం కంభం వైజంక్షన్ దగ్గర గల బృందావన్ ఫంక్షన్ హాల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, చౌక్ సెంటర్, శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయం మీదుగా ఇస్కాన్ ఆల్ ఇండియా పాదయాత్రలో అధ్యక్షుడు శ్రీమాన్ ఆచార్య పట్టాభి చేసిన ప్రవచనాలు అలరించాయి.

డ్రోన్లతో నేర నియంత్రణ : ఎస్పీ దామోదర్



ఎస్పీ దామోదర్‌కు డ్రోన్‌ను అందజేస్తున్న పోలిరెడ్డి

మార్కాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణకు డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. మార్కాపురం మండలం కోలభీమునిపాడు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బి.పోలిరెడ్డి మంగళవారం ఎస్పీ దామోదర్‌కు అత్యాధునిక డీజేఐ ఏఐఆర్ 3ఎస్ మోడల్ డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. డ్రోన్ కెమెరాలు డేగ కన్నులా పనిచేస్తాయన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా జూదం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకునే ప్రాంతాలను డ్రోన్ల ద్వారా పసిగట్టి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విజిబుల్ పోలీసింగ్, వీఐపీ బందోబస్తు, ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్లు ఎంతగానో సహకరిస్తాయన్నారు. ఈ సందర్భంగా డ్రోన్‌ను అందజేసిన పోలిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మార్కాపురం సీఐ పి.సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమ్మరావు, కొత్తపల్లి టీడీపీ నాయకులు మట్టం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు, సర్వీస్ రోడ్డును నిర్మించాలి

కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై ప్రజల ఆందోళన



కేజీ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ప్రజలు

పెద్దదోర్నాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నగుడిపాడు గ్రామం వద్ద స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, అలాగే సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరుతూ చిన్నగుడిపాడు, పెద్ద బొమ్మలాపురం గ్రామ ప్రజలు, విద్యార్థులు మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పీడు బ్రేకర్లు లేని కారణంగా సోమవారం వ్యక్తి మృతి చెందాడన్నారు. ప్రధానంగా పెద్ద బొమ్మలాపురం నుంచి కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపైకి వచ్చేటప్పుడు పలు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. రోడ్డుపై ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి ఆందోళన చేపట్టడంతో వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై మహేశ్ అక్కడకు చేరుకుని సంబంధిత అధికారులతో చర్చిద్దామని, ఆందోళన విరమించాలని సూచించారు. ఆందోళన విరమణతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

ప్రసవాలన్నీ పోర్టల్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలతో పాటు ప్రైవేటు వైద్యశాలల్లో జరిగే డెలివరీల వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక సర్వజన మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం గ్రామీణ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ ఉద్యోగుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్‌సీహెచ్ 2.0 పునరుత్పత్తి, శిశు ఆరోగ్యపోర్టర్-వెర్షన్ 2.0లో నివేదికలను పొందుపర్చాలన్నారు. ప్రసూతి ఆరోగ్యం, శిశుఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, పునరుత్పత్తి ఆరోగ్య సేవలను ఒకే వ్యవస్థలో అనుసంధానిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక అవగాహనతో ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సౌజన్య, వాణిశ్రీ, కమలశ్రీ, రాహుల్, సుజన, మాస్‌మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ఒంగోలుకు చేరిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పాదయాత్ర



ర్యాలీలో అశోక్, మాజీ ఎంపీ మోహన్

ఒంగోలుక్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్‌కు వ్యతిరేకంగా.. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని మాల ఉద్యోగుల సంఘం చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఒంగోలుకు చేరింది. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ పాదయాత్ర చేపట్టారు. ఈ మేరకు ఒంగోలులో మాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కొప్పోలు ఏడుకొండలు నేతృత్వంలో పాదయాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యక్రమలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చింతామోహన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరావు, విజేంద్రబహుజన్‌తోపాటు మాల జేఏసీ నాయకులు మేడిద రవికుమార్, చెన్న కేశవులు, బట్టుపల్లి రాజు, మేడికొండ లక్ష్మీనారాయణ, శాంతారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో దుకాణాల తొలగింపు

పంచాయతీ అధికారులు, పోలీసుల సహకారంతో ఆక్రమణలకు చెక్

రాజకీయ కక్షతో అడ్డుకున్నారంటూ మండల వైసీపీ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి ఆగ్రహం

ముండ్లమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామంలో వైసీపీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి అక్రమంగా దుకాణాలు నిర్మించారు. పసుపుగల్లు నుంచి చింతలపూడి వెళ్ళే ప్రధాన రహదారి స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మించుకున్న షాపులను తొలగించాలంటూ పంచాయతీ అధికారులు ఆదేశాలు ఇచ్చారు.మంగళవారం ఉదయం పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఎక్స్‌కవేటర్‌తో షాపులను తొలగిస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్, వైసీపీ మండల కన్వీనర్ తన కుటుంబ సభ్యులతో కలసి ఆక్రమణ తొలగింపులను అడ్డుకున్నారు. తమకు ముందస్తుగా చెప్పకుండా తొలగిస్తే ఒప్పుకొనేది లేదని అన్నారు. తాము షాపులు నిర్మించుకున్న స్థలాన్ని దేవుడికి ఇస్తున్నామని చెప్పామని, అయినా రాజకీయ కక్షతో తొలగిస్తున్నారని దర్శి సీఐ వై.రామారావుతో వాగ్వివాదానికి దిగారు. తాము చేసేదేమి లేదని, పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు బందోబస్తుకు వచ్చామని సీఐ తెలిపారు. అడ్డుకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్నక్రమంలో కుటుంబసభ్యులు కూడా పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో పోలీసులు వారిని చెదరగొట్టి ఆక్రమణలో ఉన్న షాపులనం తొలగించారు. అనంతరం కొద్దిసేపు తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. పోలీసులతో వాగ్వివాదానికి దిగటంతో పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతరం అక్కడి నుంచి శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులు ఇంటికి వెళ్ళటంతో సమస్య సద్దుమణిగింది. ముండ్లమూరు, దర్శి, తాళ్ళూరు ఎస్ఐలు కె.కమలాకర్, ఎం.మురళీ, ఎస్.మల్లికార్జునరావు, ఏఎస్ఐలు బి.పవన్ కుమార్ తదితరులు బందోబస్తు నిర్వహించారు.

పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న ఆక్రమణదారుడు శ్రీనివాసరెడ్డి, కుటుంబ సభ్యులు →



దొడ్డంపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

తొమ్మిది మందికి గాయాలు

21 మందిపై కేసు నమోదు

వినాయకుడి ఊరేగింపులో ఘటన

గిద్దలూరు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొడ్డంపల్లి గ్రామంలో వినాయక విగ్రహాల తరలింపు సమయంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 9 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గిద్దలూరు మండలం దొడ్డంపల్లిలో సోమవారం రాత్రి తెలుగుదేశం పార్టీ వర్గీయులు వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తుండగా బాణసంచా పేల్చడంతో వాటి రవ్వలు పలువురు వైసీపీ నాయకుల ఇళ్లల్లో పడడంతో వైసీపీకి చెందిన పలువురు టీడీపీ వర్గీయులపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన ఆరుగురికి, వైసీపీకి చెందిన ముగ్గురికి గాయాలుగా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గ్రామంలో మళ్లీ ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులను ఏర్పాటు చేశారు. ఇరు వర్గాలు ఫిర్యాదు చేయడంతో 21 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. టీడీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నాయకుడు బొర్రా కృష్ణారెడ్డితో పాటు వారి అనుచరులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

పర్యావరణ హిత విగ్రహం



ఒంగోలు మండలం మండవవారిపాలెంలో వినాయకచవితిని పురస్కరించుకుని గ్రామానికి చెందిన సీహెచ్.రామయ్య మట్టితో భారీ వినాయక విగ్రహాన్ని రూపొందించారు. ఇందుకోసం ఆయన సుమారు ఆరురోజుల పాటు కష్టపడి రూపొందించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ విగ్రహ నిర్మాణం కోసం లోపలి భాగం వరిగడ్డి వాడినట్లు తెలిపారు. అలాగే ఏడు బస్తాల నల్లరేగడి మట్టి పూతతో వినాయక విగ్రహం తయారు చేసినట్లు చెప్పారు. దీనివల్ల ఎలాంటి పర్యావరణ కాలుష్యం ఉండదన్నారు. ఈ గణేషుడి విగ్రహాన్ని గ్రామస్థులు గ్రామంలోని శ్రీకోదండరామ స్వామివారి దేవాలయంలో చవితి పూజా కార్యక్రమాలకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని తిలకించేందుకు స్థానికులు ఉత్సాహం చూపుతున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన



మట్టితో తయారు చేసిన విగ్రహాలతో విద్యార్థులు

చీమకుర్తి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే మహా గణపతి అని, పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ పాటుపడాలంటూ పల్లామల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థులు అందరికీ అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని పర్యావరణ హితం కోసం విద్యార్థులు హెచ్ఎం జీవీ స్టార్.సాయి పర్యవేక్షణలో మంగళవారం పాఠశాలలో మట్టి గణపతి ప్రతిమలను తయారుచేశారు. మట్టి విగ్రహలకే పూజలు చేస్తామంటూ ప్రతిన పూనారు.

ప్రజాప్రతినిధుల చవితి శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్/కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. మట్టితో చేసిన విఘ్నేశ్వరస్వామిని నవరాత్రులు నిష్టతో పూజించి పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

- వినాయక చవితి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని, ఆ విఘ్నేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

ఆట వస్తువుల విరాళం

టంగుటూరు (కొండపి), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పునాయుడుపాలెం గ్రామంలోని జడ్పీ స్కూల్‌కు హెచ్ఎం ఎన్వి సుధారాణి పదివేల రూపాయలతో క్రీడాసామగ్రి, వస్తువులు మంగళవారం అందజేశారు. స్కూల్ విద్యార్థుల ఆసక్తిని గమనించిన హెచ్ఎం సొంత నిధులు వెచ్చించి ఆట వస్తువులు అందజేశారు.

ఘనంగా ముందస్తు చవితి వేడుకలు



దేవతల విషధారణలో చిన్నారులు

మద్దిపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని నాగార్జున హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణనాథుడు, దేవతల వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏవీ.సుబ్బారావు, ప్రిన్సిపాల్ మాధవి, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే నారాయణ హైస్కూల్ విద్యార్థులు విగ్నేశ్వరుని ప్రతిమలతో ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ బెజవాడ సురేష్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

29న సదస్సును విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన ఒంగోలులో సీవీఎన్ రీడింగ్‌రూం ఆవరణలో వర్తమాన రాజకీయాలు, ప్రజా ఉద్యమాలు అనే అంశంపై జరిగే సదస్సును విజయవంతం చేయాలని పలువురు కోరారు. స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచిపుస్తకం కార్యాలయం వద్ద మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు, చావలి సుధాకర్‌రావు, ఆవుల సుబ్రహ్మణ్యం, జార్జి, అంకయ్య, సుబ్బారావు, పిచ్చయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

- ఎమ్మెల్యే దామచర్ల
- డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిమల పంపిణీ



గణేషుడి ప్రతిమలను అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల, ట్రస్టు ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ట్రస్ట్ ప్రతినిధులు నాగసత్యలత, తనూజాలక్ష్మి, అనీషాలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని కోరారు. మట్టి విగ్రహాలతో పరార్యవరణ పరిరక్షణకు దోహదపడుతుందని చెప్పారు. అలాగే స్థానిక గాంధీరోడ్‌లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. స్థానిక రామనగర్‌లోని శ్రీసూర్య విద్యానికేతన్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ రామాల వెంకటరామరెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం : ఎంపీ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సూచించారు. స్థానిక రామనగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం రైల్వేశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆర్వోబీలు, ఆర్‌యూబీలతో పాటు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ పనుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే వాటిని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే ఏడీఈ శంకరరావు, ఆర్‌వీఎస్ ఎల్‌సైట్ ఇంజనీర్ రాధాకృష్ణ, ఆర్ఎస్పీ సుందర్‌సింగ్, డీఆర్ రవికుమార్, డీఆర్‌యూసీ సభ్యులు నాదెండ్ల మనోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంతకుమందు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే ఎంపీ మాగుంటను రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్మన్ బోడపాటి తేజస్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాంస్కృతికంగా ఒంగోలును అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

'యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు'

కొండపి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు, ఏవో మాల్యాద్రి ఎరువుల డీలర్లను హెచ్చరించారు. మంగళవారం కొండపిలోని పలు ఎరువుల దుకాణాలను అధికారులు పరిశీలించారు. ఎరువుల స్టాక్‌ను, రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసినపుడు తగిన రశీదులు తీసుకోవాలని, డీలర్లు ఎమ్మార్పీ ధరలకు అమ్మాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలో పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో..

మద్దిపాడు: యూనియాను ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో స్వర్ణలత హెచ్చరించారు. మంగళవారం వెల్లంపల్లిలోని పురుగుమందుల షాపును ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో కలిసి ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు రమణయ్య, ఎన్‌ఫోర్స్‌మెం ట్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోపు కుట్టు శిక్షణను పూర్తి చేయాలి

ఒంగోలునగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మహిళల కుట్టు శిక్షణను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన ఒంగోలులోని బాలాజీనగర్‌లో జరుగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేర్చుకున్న శిక్షణ వారి జీవనోపాధికి ఉపయోగం పడేలా ఉండాలన్నారు. మహిళలు మాట్లాడుతూ ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈడీకి తెలిపారు. రకరకాల దుస్తులు ఏ విధంగా కుట్టాలి, ప్రత్యేకించి మహిళలు, చిన్న పిల్లల దుస్తులు కుట్టుపై పూర్తి స్థాయిలో శిక్షణ తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌వీ.రాఘవ, సీహెచ్.శ్రీనుబాబు మాట్లాడుతూ గత కొన్నేళ్ళ నుంచి హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందిస్తూ వస్తున్నామని చెప్పారు. అనంతరం మట్టివినాయక ప్రతిమలు, కథ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను నిర్మించాలి

- మండల సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్

ఒంగోలు(రూరల్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సురక్షితనీరు సరఫరా చేసేందుకు అందుకు అవసరమైన వ్యవస్థలను నిర్మించాలని, ఫిల్టర్‌బెడ్‌లు, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మానం చేపట్టాలని పలువురు సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండవవారిపాలెం సర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గ్రామంలో ఫిల్టర్‌బెడ్‌లు పని చేయడం లేదని, దీంతో గ్రామస్థులు మంచినీరు సరఫరా చేయలేక పోతున్నామని చెప్పారు. నూతన ఫిల్టర్‌బెడ్‌ల కోసం నిధులు కేటాయించాలని కోరారు. దేవరంపాడు సర్పంచ్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఫిల్టర్‌బె డ్‌లు కూడా దెబ్బతిన్నాయని, వాటిని కొత్తగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డివిజనల్ డవలప్‌మెంట్ అధికారి సీహెచ్.సువార్త మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు బయోమెట్రిక్ సకాలంలో వేయటంలేదని, కొందరైలే బయోమెట్రిక్ హాజరును పూర్తిగా వదిలేశారని, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి పథకం ద్వారా ఇంకుడుగుంతల నిర్మాణాలను ఈనెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో శేషబాబు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు సర్పంచ్‌లు ఎప్పటికప్పడు పరిశీలించాలన్నారు. సొసైటీలకు వచ్చిన ఎరువులను కావాల్సిన రైతులు పొందాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య మాట్లాడుతూ గ్రామాల్లో స్వామిత్వ సర్వే జరుగుతుందని, ఇల్లు, ఖాళీ స్థలాలను పూర్తిగా సర్వే చేస్తామని, అందువల్ల సర్పంచ్‌లు, గ్రామస్థులు పరిశీలించుకోవాలన్నారు. కార్యక్రమంలో కరవది వైద్యాధికారి సుందరప్రసాద్, ఏవో కె.రమేష్‌బాబు, పశువైద్యాధికారి వై.భూపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ రామ్‌ప్రసాద్, మత్స్యశాఖ అధికారి ఆషా, పరిశ్రమలశాఖ ఐపీవో ఎస్.ధనలక్ష్మి, అటవీశాఖ అధికారి నరసింహారావు, కరవది సొసైటీ అధ్యక్షుడు ముప్పవరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పాలేటి శ్రీనివాసరావు, మన్నె శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మంచు మురళి, దేవరంపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన నీటిని అందించాలి

- కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలోని న్యూ ఫిల్టర్ బెడ్‌ను ఆయన పరిశీలించారు. వేసవి చెరువుల నుంచి నీరు విడుదల, నీటి శుభ్రత, ప్రతిరోజు తాగునీటి పరీక్షలను పరిశీలించిన ఆయన కలుషితమైన నీరు సరఫరా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు కలుషితం కాకుండా లీకులు నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈ ఐశయ్య, ఏఈ అంజిరెడ్డి, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. నాగులుప్పలపాడు, టి.అగ్రహారం గ్రామాల్లోని సచివాలయాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న కౌసల్యం (వర్క్‌ఫ్రమ్ హోమ్) సర్వేను పూర్తిచేయాలని ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం చీర్వానుప్పలపాడు గ్రామంలో కల్లూరి నాగేశ్వరరావు సాగుచేస్తున్న మునగ తోటను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీదేవి, శరత్, ఏపీవో రవిబాబు, ఎంఆర్‌సీ అంజయ్య, టీడీపీ నాయకుడు మురళీ పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- రెండో రోజూ జోరుగా సోదాలు
- పొదిలిలో ఐదు దుకాణాల్లో తనిఖీ
- పొదిలిలో 2.90 మెట్రిక్ టన్నుల స్టాక్ అమ్మకాల నిలిపివేత

పొదిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : దుకాణదారులు కావాలని ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక రేట్లకు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ టీం సభ్యులు తహసీల్దార్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. పట్టణంలో ఉన్న 19 ఎరువుల దుకాణాల్లో గత రెండురోజులుగా దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. మంగళవారం పట్టణంలో పాతూరులో మిగిలిన ఐదు దుకాణాల్లో తహసీల్దార్, వ్యవసాయాధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కొన్ని ప్రైవేట్ ఎరువులు దుకాణాలను తనిఖీ చేయగా 2.90 మెట్రిక్ టన్నులకు సంబంధించిన రూ.31,900 విలువ గల ఎరువులకు సరైన పత్రాలు లేకపోవడంతో ఆ స్టాకు అమ్మకాలు నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. వ్యాపారులు రైతుల అవసరాలను గుర్తుంచి ఎలాంటి కొరతను లేకుండా ఎరువులను అందజేయాలన్నారు. కాదని ఇష్టారీతిన అమ్మకాలు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి కొనుగోలకు తప్పకుండా రసీదును అడిగి తీసుకోవాలని రైతులను కోరారు. నఖిలీ విత్తనాలు, పురుగుమందులు అమ్మినవారిపై చర్యలతోపాటు దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమతి ఉన్న గోడౌన్‌లలో ఉన్న స్టాకును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, స్టాకు బోర్డ్‌లో రైతులకు తెలిసేలా అమర్చాలని చెప్పారు. ఈ తనిఖీల్లో వ్యవసాయధికారి డి శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు. ఇదిలావుండగా అధిక ధరలకు ఎరువుల అమ్మకాలు సాగుతున్నాయని రైతులు అంటున్నారు.

మార్కాపురం రూరల్ : మార్కాపురం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం తహసీల్దార్ చిరంజీవి ఏవో బుజ్జిబాయి, పోలీసులతో కలసి తనిఖీలు చేశారు. ఎరువుల బస్తాల నిల్వలను పరిశీలించారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకు విక్రయించాలని, ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గాయత్రి ట్రేడర్స్, సాయి భాగ్యలక్ష్మి ట్రేడర్స్ షాపులలో అనుమతి పత్రితం లేకపోవడంతో ఎరువుల విక్రయాలను నిలిపియాలని ఆదేశించారు.

తర్లుపాడు : తర్లుపాడులోని లక్ష్మీ సాయి ఎరువుల దుకాణాన్ని తహసీల్దార్ కేకే కిశోర్ కుమార్, వ్యవసాయాధికారి జోత్స్నాదేవి తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న స్టాక్, రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణాలలో ఉన్న ధరల పట్టికలను పరిశీలించి గోడౌన్‌లలో నిల్వ ఉన్న కాంప్లెక్స్ ఎరువులను తనిఖీ చేశారు. యూరియాను ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామమని ఏవో హెచ్చరించారు.


పొదిలిలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, ఏవో విజయభాస్కర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీకృష్ణ ట్రేడర్స్, చీతిరాల నాగేశ్వరరావు, శ్రీమణికంఠ రైతు డిపో దుకాణాలను, గోడౌన్లను తనిఖీ చేశారు. జీరో ఫామ్స్ లైసెన్సులో జతకానందున 16.2 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను సుమారు రూ.3,15,600 విలువైన వాటిని అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎర్రగొండపాలెం : మండలంలోని మొగుళ్లపల్లి సచివాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న యూరియా స్టాక్‌ను ఏవో కే నీరజ మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆ శాఖ సిబ్బంది ఉన్నారు.

పెద్ద దోర్నాల : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. తహసీల్దార్‌తో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏవో జవహర్‌లాల్‌నాయక్, పోలీసులు మండలంలోని నాలుగు ఎరువుల దుకాణాల్లో ఆకస్మికంగా సోదాలు చేపట్టారు. అనుమతులు లేని రూ.4,22,000 విలువైన 12.100 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, రసీదులు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు.

రూ.2.67లక్షల స్టాక్ అమ్మకం నిలిపివేత

కొనకనమిట్ల : మండలంలోని ఎదురాళ్లపాడు, పెదారికట్ల గ్రామాలలోని ఎరువుల దుకాణాల్లో తహసీల్దార్ ఆవుల సురేష్, దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెదారికట్ల ఎరువుల షాపులో రూ.2.67లక్షల విలువైన సల్ఫేట్, ఎంవోపి, పొటాష్ ఎరువులను సీజ్ చేసినట్లు చెప్పారు. అనుమతి లేనివి, ఎమ్మార్పీ ధరలకు మించి ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసా అధికారి ప్రకాష్‌రావు, ఏఎస్‌ఐ ముహ్మద్, పలువురు వ్యవసాయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


గిద్దలూరులో సోదాలు చేస్తున్న తహసీల్దార్, వ్యవసాయాధికారులు

రాచర్ల : యూరియాను రైతులకు మాత్రమే అమ్మాలని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. రాచర్లలోని రంగస్వామి ట్రేడర్స్, వెలిగొండ ట్రేడర్స్ ఎరువుల షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హర్షగౌడ్, హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య, షాపుల యజమానులు రంగస్వామి రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

త్రిపురాంతకం : మండలంలోని నడిగడ్డలో ఎరువుల దుకాణాలపై ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. మాధవి ట్రేడర్సులో 4 మెట్రిక్ టన్నుల ఎరువులు వ్యత్యాసం ఉండడంతో సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. వైష్ణవి ట్రేడర్సులో 35 మెట్రిక్ టన్నుల ఎరువులకు అనుమతి లేనందున అమ్మకాలను నిలిపివేశారు. కార్యక్రమంలో ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు సీఐ రాఘవరావు, డీసీపీవో రామారావు, శివనాగప్రసాద్, ఏవో సంగమేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.


త్రిపురాంతకంలో దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టీడీపీ అధ్యక్షుడు ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మండల పార్టీ అధ్యక్ష పదవికి, మండలంలో వివిధ అనుబంధ సంఘాల కమిటీల కోసం పేర్లను ప్రతిపాదించారని వాటిని అధిష్టానానికి పంపిస్తామన్నారు. పార్టీ ఆమోదం తర్వాత పేర్లు ప్రకటిస్తామని ఎరిక్షన్‌బాబు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను, గోళ్ల సుబ్బారావు,తోట మహేష్, పట్టణ అధ్యక్షుడు పీ మల్లికార్జునరావు, కొత్తమాసు సుబ్రమణ్యం, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, సాయపునేని సుందయ్య, షేక్ మస్తాన్‌వలి, చేదూరి గంగయ్య, అచ్యుతరావు, చెవుల అంజయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గిద్దలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు కొమ్ము నూరి అరుణ్‌తేజ డిమాండ్ చేశారు. గిద్దలూరులో జరిగిన విద్యార్థుల సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు అరుణ్‌తేజ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, మార్కాపురం మెడికల్ కాలేజీ, గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, మార్కాపురం, దర్శిలలో డిగ్రీ కళాశాలల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 28 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు నిర్వహించనున్న సైకిల్ యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సుభాష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులపై ఆసక్తి పెంచుకోండి

రాచర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఒకేషనల్ కోర్సులపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు. ఎలక్ట్రానిక్ ఒకేషనల్ కోర్సులలో భాగంగా బైక్ మెకానిక్, స్పేర్ పార్ట్‌లకు సంబంధించి వాటి ప్రాముఖ్యతను, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏదో ఒక పని నేర్చుకుంటేనే సమాజంలో రాణించగలమని కాబట్టి విద్యార్థులు విద్యతోపాటు మిగిలిన రంగాలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆసక్తి ఉంటే ఏదైనా సాధించగలరని అన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఉపాధ్యాయులు జి రఘురామయ్య, జి రాజన్న, రాము, మహేష్ పాల్గొన్నారు.


ధ్వంసమైన చెక్‌డ్యాం

సత్యవోలులో చెక్‌డ్యాం ధ్వంసం

రాచర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్యవోలు గ్రామ పంచాయితీ భూవనిగుంట్ల ఇలాకాలో దాదాపు 15 సంవత్సరాల కిందట నిర్మించిన చెక్‌డ్యాంను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగినట్లు తెలిసింది. 2010 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం దాదాపు రూ.40లక్షలు వెచ్చించి ఈ చెక్ డ్యామ్ నిర్మించింది. సమృద్ధిగా వర్షాలు పడి నీరు చెక్‌డ్యాంకు వస్తే రెండు, మూడు సంవత్సరాల వరకు తాగు నీటి సమస్య ఉండేది కాదని, పశువులకు, గొర్రె, మేకలకు ఎంతో ప్రయోజనం కలుగుతూ ఉండేదని ప్రజలు తెలిపారు. కొందరు స్వార్ధంతో ఈ చర్యకు పాల్పడ్డారని ప్రజలు అంటున్నారు. ఈ ఘటనపై ఇరిగేషన్ శాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి


థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మానవతకు మారు పేరు మదర్ థెరిస్సా అని సాయి బాలాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలి అన్నారు. స్థానిక సాయి బాలాజీ పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా థెరిస్సా విగ్రహానికి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేవాభావంతో తన, పర భేదాలు లేకుండా ఎంతోమందిని ఆదుకున్న చిరస్మరణీయురాలు థెరిస్సా అని, ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా, జాలి, దయాగుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు : యువప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. మానసిక దివ్యాంగుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మదర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రతినిధులు రత్నం, పీరయ్య, ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నీటి వసతి ఏర్పాటు

తర్లుపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి ఆక్వా ప్లాంట్‌ను ఎంఈవో అచ్యుత్ సుబ్బారావు ప్రారంభించారు. ఒంగోలు పట్టణానికి చెందిన బొగ్గవరపు జయరావు ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసిన ఆక్వాగార్డు విద్యార్థులకు దహర్తి తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యాఆర్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయం అన్నారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.జగన్‌బాబు, ఉపాధ్యాయురాలు ఎం.అనూష, ఎస్‌ఎంసీ చైర్మన్ తంగిరాల అనిల్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుక దందా ఆరోపణలు నిరాధారమైనవి

మార్కాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో ఇసుక దందా జరుగుతున్నట్లు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని లారీ ఓనర్లు పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడారు. ఎమ్మెల్యేతో కుమ్మక్కై లారీ ఓనర్ల అసోసియేషన్ ఇసుక దందా చేస్తోందని బొందిలి కాశీరామ్‌సింగ్ అనే వ్యక్తి అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. అసలు మార్కాపురంలో లారీ ఓనర్ల అసోసియేషన్ లేదన్నారు. అతని మాటలు నమ్మి తమలో కూడా కొందరు మోసపోయామన్నారు. సమావేశంలో లారీ ఓనర్లు ఉప్పలదిన్నె శ్రీనివాసులు, బొందిలి లక్ష్మణ్‌సింగ్, యు.వెంకటేష్, రమేష్, బోగినేని చిరంజీవి పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ పిల్లలపై దృష్టి సారించండి

రాచర్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : డ్రాపౌట్స్ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో వీ గిరిధర్ శర్మ అన్నారు. ఎంఈవో కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌ఏ-1 మార్క్స్ ఎంట్రీ, అసెస్మెంట్ బుక్స్ అపార్ క్రియేషన్, విద్యామిత్ర కిడ్స్ బయోమెట్రిక్ తదితరవి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆయన అనుములపల్లి, చిన్నగానిపల్లి పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్ మొయినుద్దీన్, హెచ్‌ఎంలు, కేజీబీవీ, గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు సర్వం సిద్ధం

- పందిళ్లు, మండపాల ఏర్పాటు
- విద్యుత్ దీపాలతో అలంకరణ

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక చవితి నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. చవితి పండుగ సందర్భంగా మండపాలలో వినాయక విగ్రహాలు ఉంచి పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పట్టణంలోని మెయిన్ బజార్, విఘ్నేశ్వర స్వామి ఆలయం, పేరం బజార్, నెహ్రూ బజార్, గాంధీ బజార్, తూర్పు వీధి తదితర ప్రాంతాలతో పాటు పట్టణంలోని వాడవాడలా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు సిద్ధం చేశారు. మంగళవారం గణేశుడి బొమ్మలు, పూజా సామగ్రి కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తున్నారు. పట్టణంలోని వీధులన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వినాయక చవితి వైభవంగా నిర్వహించుకునేందుకు సర్వం సిద్ధం చేశారు.

గిద్దలూరు : వినాయక చవితి పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. గిద్దలూరు పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా వినాయక చవితి సందర్భంగా గణనాథుల విగ్రహాలను వీధుల్లో, సెంటర్లలో ఏర్పాటు చేసేందుకు వీలుగా పందిళ్లను, మండపాలను ఏర్పాటు చేశారు. వాటికి రంగురంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలతోపాటు సామూహిక పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని సుమారు 30 ప్రాంతాలలో, మండలంలోని గ్రామాల్లో 100కి పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే పందిళ్లను వేశారు. కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలను ఆనందోత్సాహాల మధ్య రంగులు చల్లుకుంటూ నిర్వాహకులు పందిర్లకు తరలిస్తున్నారు. అపార్టమెంట్లలో కూడా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజలు సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని శ్రీవర సిద్ధి వినాయకస్వామి దేవాలయంలో, రేడియోబావి సెంటర్ నందు గల వస్త్రగణపతి, పొట్టిశ్రీరాములు సెంటర్‌లో, గణేష్ నగర్, గాంధీబొమ్మ సెంటర్, రాచర్ల రోడ్డు, తదితర ప్రాంతాలలో పెద్ద స్థాయిలో చవితి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.


కంభంలో మండపాలకు తరళివెళ్తున్న లంబోదరుడు


కొలుకుల సెంటర్‌లోని మండపంలో కొలువుదీరిన మహాగణపతి

మట్టి విగ్రహాలనే వాడాలి

తర్లుపాడు : కాలుష్య నివారణకు మట్టి విగ్రహాలనే వాడాలని ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మట్టి ప్రతిమలను సొంతగా తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. వినాయక నవరాత్రుల సందర్భంగా మట్టి విగ్రహాలనే వాడాలని, దీంతో పర్యావరణకు దోహదం చేస్తుందని అన్నారు. 10 మంది విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఎంతో నైపుణ్యంతో విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేళతాళాలతో తరలుతున్న గణనాథులు

కంభం : కంభం, అర్థవీడు, బేస్తవారపేట మండలాల్లోని గ్రామాలలో ఏర్పాటు చేసిన మండపాలలో కొలువుదీరేందుకు సోమవారం రాత్రి నుంచి వందలాది విగ్రహాలు తరలివెళ్లాయి. కంభం చెరువులో 5అడుగుల మేర నీరు ఉండడంతోపాటు గుండ్లకమ్మ, జంపలేరు వాగులలో కూడా నీరు పుష్కలంగా ఉండడంతో మూడు మండలాల ప్రజలు పెద్ద ఎత్తున చవితి వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్క కంభం పట్టణంలోనే 50కి పైగా మండపాలు భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేశారు.

ఎర్రగొండపాలెం రూరల్ : వినాయక చవితి ఉత్సవాలకు మండలం వ్యాప్తంగా మండపాలు సిద్ధమయ్యాయి. బుధవారం నుంచి చవితి వేడుకలు మొదలవుతున్న సందర్భంగా మండలంలోని వీరభద్రాపురం, గోళ్లవిడిపి, తమ్మడపల్లి, బోయలపల్లి తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఆయా గ్రామాలలో కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.


మార్కాపురం మెయిన్‌బజార్‌లో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన మండపం

నేడు గుండురాయి పందెం

గిద్దలూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముండ్లపాడు గ్రామంలో గల కోదండ రామస్వామి దేవస్థానం వద్ద వినాయక చవితి పండుగ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 2గంటలకు గుండు రాయి ఎత్తే పందెం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రథమ విజేతకు రూ.3వేలు, ద్వితీయం రూ.2వేలు బహుమతిగా ఇవ్వడం జరుగుతుందని, రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించాలని, వివరాలకు 9989459737, 9000448712 సంప్రదించాలని పేర్కొన్నారు.

బార్ లైసెన్స్ గడువు 29వరకు పెంపు

పొదిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పరిధిలో బార్ల ఏర్పాటుకు లైసెన్స్‌లను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ అరుణకుమారి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని గడువు ముగిసినప్పటికీ తిరిగి గడువును ఈనెల 29వ తేదీ వరకు అప్లికేషన్ నమోదు గడువు పొడిగించినట్లు సీఐ తెలిపారు. 30వ తేదీన డ్రా తీస్తారన్నారు. మంగళవారానికి ఒక అప్లికేషన్ వచ్చినట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఫీజు రూ.5లక్షలు చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు.

కాలువల్లో మురుగు తొలగింపు

పొదిలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబస్టాండ్, బీఎస్ఎన్‌ఎల్ ఆఫీస్ ప్రాంతాల్లో రహదారిపైకి మురుగు నీరు రాకుండా కాలువల్లో పూడిక తీయించారు. నగర పంచాయతీ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం కాలువలతోపాటు దుకాణాల ముందు ఉన్న మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తీశారు. ఎంతో కాలంగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పెద్ద ఎత్తున వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోయాయి. దీంతో మురుగు రోడ్లపైకి వస్తుండడంతో కమిషనర్ చర్యలు చేపట్టారు.

కుక్కలకు ఏబీసీ ఆపరేషన్

పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున మంగళవారం ఒంగోలు స్నేహ యానిమల్ కేర్ వారు 25 కుక్కలను పట్టుకొని వాటిని ఒంగోలు కుక్కల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి తెలిపారు. కుక్కలన్నింటికీ సంతాన నిరోధక (యానిమల్ బర్త్ కంట్రోల్) ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఏబీసీ ఆపరేషన్ అనంతరం కొన్నిరోజులు వైద్యుల పర్యవేక్షణ ఉంచి తరువాత కుక్కలను వదిలివేస్తారని తెలిపారు.

వీవోఏకు ఘన సన్మానం

కంభం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వెలుగు కార్యాలయం వీవోఏగా విధులు నిర్వహిస్తున్న ఉయ్యాలవాడ రత్నమ్మ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా కంభం పొదుపు గ్రూపు సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక తెలుగు వీధిలోని కల్యాణ మండపంలో పొదుపు గ్రూపు మహిళా సభ్యులు రత్నమ్మను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పొదుపు గ్రూపు సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

జీపు కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జీపు కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు అందె నాసరయ్య అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధం జీప్ మోటార్ వర్కర్స్ యూనియన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ కాశీం మాట్లాడుతూ.. జీపు కార్మికులకు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పఠాన్ అమిరుల్లా ఖాన్, నాయకులు రామయ్య, నరసింహ, వలి, పత్తి శీను, శేఖర్, శీను పాల్గొన్నారు.

ఈపంట నమోదు చేయించుకోవాలి

పీసీపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలన్నింటికీ ఈపంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.రంగాక్రిష్ణ అన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా చేయించుకునేందుకు ఈనెల 31వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. రైతులందరూ సాగుచేసిన ప్రతి పంటకు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా రైతులు సాగుచేసిన కంది పైరును పరిశీలించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దొనకొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పత్తి, కంది సాగుచేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయపరంగా పంటల సాగులో చేపట్టాల్సిన అనేక అంశాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు అవసరమైన యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే ఎరువుల షాపుల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పీసీపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రమేష్ అన్నారు. మండలంలోని గుదేవారిపాలెం గ్రామంలో న్యాయసేవాధికార సంస్థ, బంగారుబాల్యం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలు చేయడం ద్వారా బాలికలు అనారోగ్యం పాలవుతారని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఇక్బాల్, మహిళా పోలీసు సల్మా, ఏఎన్ఎం శ్రావణి, భాగ్యలక్ష్మి, ధనరాజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక విగ్రహాలను వాడొద్దు!

పామూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మలను వాడొద్దని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి.చెన్నకృష్ణ అన్నారు. మట్టిచే తయారు చేబడిన వినాయక విగ్రహాలనే పూజించాలన్నారు. స్థానిక మదర్‌కేర్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనిక విగ్రహాలు వాడకం వల్ల భూమి, నీరు, గాలి కలుషితమవుతుందున్నారు. దాంతో ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పట్నం వీరబ్రహ్మం, కె.శంకర్, పాల్గొన్నారు.


మదర్ థెరిస్సా జీవితం స్ఫూర్తిదాయకం

కనిగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా జీవితాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని జేవీవీ జాతీయ నాయకుడు గయాజ్ అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక వైఎస్సార్ రోడ్డులో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గయాజ్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిగ్రస్థులకు ఆమె ఎంతో సేవచేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల తాతపూడి ఐజక్, బ్రాక్, జైభీం నాయకులు సూరె రాజు, జంషీర్, నీలా, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

కనిగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. మండలంలోని పునుగోడు, బొమ్మిరెడ్డిపల్లి, తాళ్ళూరు, గుడిపాడు గ్రామాల్లోని సచివాలయాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వే రిపోర్ట్‌లను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వామిత్వ కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కొంతమంది సిబ్బంది విధులకు రాకుండా హాజరు వేసుకుంటున్నట్లు తమకు గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అలాంటివి జరిగితే శాఖపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా యాసిన్ ఎన్నిక



కనిగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా కనిగిరి పట్టణానికి చెందిన సయ్యద్ యాసిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఏకగీవరంగా ఎన్నుకున్నారు. తొలుత ఆయన ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. సీపీఐ జిల్లా నాయకుడిగా పలు బాధ్యతలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

‘స్త్రీశక్తి’ సూపర్ సక్సెస్

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, తదితరులు

దర్శి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకం సూపర్ సక్సెస్ అయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో జరిగిన కృతజ్ఞతా సదస్సులో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేయటంతో అన్నివర్గాల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత గ్యాస్, తల్లికి వందనం, స్త్రీశక్తి పథకం అమలు చేయటంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. ఉచిత బస్సు పథకం ప్రారంభంనుంచి మహిళల ప్రయాణాల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. పథకం అమల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుజాగ్రత్తగా అదనపు బస్సులు సమకూరుస్తున్నారని చెప్పారు. పనుల కోసం మహిళలు రాష్ట్రవ్యాప్తంగా బస్సుల్లో సంచరిస్తూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వంకు కృతజ్ఞత తెలియజేస్తూ మహిళల ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. మహిళల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వంకు మహిళలు అండగా నిలవాలని కోరారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, దర్శి, కురిచేడు, దొనకొండ, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు పి.నెమలయ్య, మోడి ఆంజనేయులు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా పాల్గొన్నారు. అలాగే, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కె.వెలుగొండారెడ్డి, దర్శి, తూర్పువెంకటాపురం సొసైటీల అధ్యక్షులు కె.చంద్రశేఖర్, దామా కృష్ణ, రాష్ట్ర తెలుగు మహిళ నాయకురాలు ఎం.శోభారాణి, దర్శి ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ఇందిర, కౌన్సిలర్లు నారపుశెట్టి ధనలక్ష్మి, నక్కా చంద్ర, పసుపులేటి శేషమ్మ, ఇత్తడి సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలు

» ప్రజావేదికలో నివేదించిన సామాజిక తనిఖీ బృందం



ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

పామూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడైంది. 2024 - 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలించి వారిదృష్టికి వచ్చిన అక్రమాలను వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 714 పనులకుగాను రూ.14 కోట్ల 58లక్షల75వేల321 రూపాయలు ఖర్చు చేశారు. అందులో ఉపాధి కింద 601 పనులకుగాను రూ.7కోట్ల 61లక్షల 59 వేలు, పంచాయతీరాజ్ కింద 113 పనులకు గాను రూ.6 కోట్ల 97లక్షల 15 వేలు ఖర్చు చేశారు.

ప్రజావేదికలో పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి పనులు పారదర్శకంగా ఉండాలంటే ప్రతి శుక్రవారం కూలీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పని ప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో వేలిముద్రలు ఉండరాదనే ఉద్దేశంతో ఉపాధి కూలీలను ఉల్లాస్ అక్షరాంధ్ర కింద అక్షరాస్యులను చేయాలన్నారు. కూలీలకు ప్రతి శుక్రవారం నిర్వహించాల్సి రోజ్‌గార్ దీవస్ ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. మస్టర్లు, రిజిస్ట్రేషన్లు వెరిఫికేషన్ చేయడంలేదని, కొన్నిచోట్ల సంతకాలు లేకుండానే చెల్లింపులు చేశారని తనిఖీ బృందం వెల్లడించింది. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు చాలాచోట్ల చనిపోయాయని తెలిపారు. దీనిపై స్పందిస్తూ పీడీ మాట్లా డుతూ మొక్కల విషయంలో రాజీ పడరాదన్నారు. మొక్కలు బతికే మార్గాన్ని అన్వేషించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

వగ్గంపల్లిలో అంగన్‌వాడీ ఆయాకు ఉపాధి పనులు కల్పించారని, హార్టికల్చర్ పనుల్లో తేడాలు ఉన్నాయని సామాజిక తనిఖీ బృందం పేర్కొంది. లబ్ధిదారులకు నగదు ఇవ్వకుండా జాన్ అనే వ్యక్తి ఖాతాకు నగదు బదలాయించారని పేర్కొంది. చెక్ డ్యాం పనులు కూలీలతో చేయించలేదని, పని ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు సమకూర్చలేదని సామాజిక తనికీ బృందం ఆరోపించింది. పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలవారీగా జరిగిన పనుల్లో అక్రమాలను నిగ్గుతేల్చి సంబంధిత వ్యక్తులపై చర్యలతో పాటు రికవరీ చేస్తామన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, కేవీఎస్‌కే ప్రసాద్, రవికుమార్, బి.మాల్యాద్రి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం

» సీఐ భీమానాయక్



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సీఐ భీమానాయక్

పామూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు వినాయక మట్టి విగ్రహాలనే పూజిద్దామని సీఐ ఎం.భీమానాయక్ తెలిపారు. స్థానిక నెల్లూరు బస్టాండ్ వద్ద వీఎస్ఆర్ ఫ్రెండ్స్ సౌజన్యంతో సమకూర్చిన వినాయక మట్టి బొమ్మలను మంగళవారం ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మండపాలకు ఉచితంగా విద్యుత్ సరాఫరా చేస్తుందన్నారు.

కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు, సంగిశెట్టి వీరయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, స్థానిక సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో ముందస్తుగా వినాయక ఉత్సవాలను విద్యార్థులు నిర్వహించారు. మట్టి, గోధుమపిండి, మైదాపిండితో గణేష్ ప్రతిమలను చేసి ప్రదర్శించారు.

నేడు కురిచేడులో పంపిణీ

కురిచేడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రధాన కూడలి వద్ద వేంచేసి ఉన్న కోదండ రామాలయం వద్ద వినాయ చవితి పర్వదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు ఇందూరి వెంకట నర్సిరెడ్డి తెలిపారు. భక్తులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గ్రామాలకు తరలిన గణనాథులు



ముండ్లమూరు: వినాయక విగ్రహాలను గ్రామాలకు తరలిస్తున్న భక్తులు

ముండ్లమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని భక్తులు పలు గ్రామాల్లో విగ్రహాలను నెలకొల్పేందుకు మంగళవారం ఆయా గ్రామాలకు తరలిస్తున్నారు. మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 50 విగ్రహాలకు పైగానే ఏర్పాటుచేస్తున్నారు. మండలంలో అత్యధికంగా పెదఉల్లగల్లు వడియరాజుల ఆధ్వర్యంలో 17 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

దొనకొండలో.. దొనకొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణనాథులను మండపాలకు తరలిస్తున్నారు. కొందరు నిర్వాహకులు భారీ వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుతీర్చారు. చవితి వేడుకలు సందర్భంగా వివిధరకాల నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసేందుకు గ్రామాల నుండి వచ్చిన ప్రజలతో దొనకొండలోని దుఖాణాలు కిటకిటలాడాయి.

కురిచేడులో.. కురిచేడు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా గ్రామాలకు విఘ్నేశ్వరులు తరలిపోతున్నారు. కోలాహలంగా వాహనాలలో వినాయక విగ్రహాలను తీసుకెళ్తున్నారు. . మండలం మొత్తం మీద 50కి పైగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.

విజిలెన్స్ దాడులతో బెంబేలెత్తుతున్న వ్యాపారులు

» దుకాణాలు మూసివేత
» అక్రమంగా నిల్వఉంచిన ఎరువులు, విత్తనాలు ఇతర ప్రాంతాలకు తరలింపు



పామూరు: ఎరువుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

దర్శి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ముమ్మర దాడులతో ఎరువులు, విత్తనాల వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. జిల్లా నుంచి అధికారులు ఏప్రాంతానికి వస్తున్నారో అనే సమాచారం ఏదోరకంగా తెలుసుకొని అధికశాతం మంది వ్యాపారులు దుకాణాలను బంద్‌చేసి పత్తాలేకుండా పోతున్నారు. అక్రమంగా నిల్వఉంచిన ఎరువులు, విత్తనాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యాపారులు సాగించిన అక్రమ వ్యాపారాల పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాలను సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో వ్యాపారుల అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు నిఘా టీమ్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గత కొన్నిరోజులుగా దర్శి, పొదిలి ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పలుచోట్ల అక్రమంగా నిల్వఉన్న ఎరువులను, విత్తనాలను సీజ్ చేశారు. ప్రధానంగా యూరియా నిల్వలు మారుమూల ప్రాంతాల్లో కూడా పట్టుబడుతున్నాయి. ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా వేస్తున్న తరుణంలో యూరియాకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో కొంతమంది హోల్‌సేల్ వ్యాపారులు వారికి వచ్చిన యూరియా కోటాను గ్రామీణ ప్రాంతాల్లో తమకు అనుకూలమైన వ్యాపారుల వద్దకు పంపి అధిక ధరలకు విక్రయించి లాభాలు పంచుకుంటున్నారు. దీంతో పలుచోట్ల ఎరువుల దుఖాణాల్లో బిల్లులు లేకుండా నిల్వ ఉన్న యూరియా వందలాది బస్తాలు పట్టుబడింది. కొంతమంది వ్యాపారులు ఇతర జిల్లాల నుంచి అడ్డగోలుగా విత్తనాలు తెచ్చి రైతులకు విక్రయిస్తున్నారు. ఆ వ్యాపారులు విత్తనాల విక్రయాలకు లైసెన్స్‌లు కూడా తీసుకోకుండా ఏళ్ల తరబడి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఇంతకాలం స్థానిక వ్యవసాయాధికారులు షాపుల యజమానులు వద్ద మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరించారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో అక్రమాలు వరుసగా బయట పడుతుండటంతో రైతులు విస్తుపోతున్నారు. వ్యాపారులు భయాందోళన లతో గడగడలాడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన విత్తనాలు నాణ్యత కల్గినివా, నాసిరకమా అన్న విషయం గురించి పట్టించుకోకుండా వ్యాపారులు లాభార్జనే ధ్యేయంగా విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎరువులు, విత్తనాల వ్యాపారాల్లో వెలుగుచూసిన అక్రమాలపై ఉక్కుపాదం పెట్టి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎరువుల దుకాణాలపై కేసులు నమోదు

పామూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల స్టాకులో వ్యత్యాసం ఉండటంతో రెండు షాపుల గోడౌన్‌లను సీజ్‌తో పాటు 6ఏ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రవిబాబు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ ఆదేశాల మేరకు మంగళవారం దాడులు నిర్వహించారు. పామూరులోని ముప్పసాని శ్రీనివాసులు, లక్ష్మీ బాలాజీ ఫర్టిలైజర్ షాపులకు చెందిన ఎరువుల గోడౌన్‌లోని స్టాకును పరిశీలించారు. ఎరువుల స్టాకులో వ్యత్యాసం ఉండటాన్ని గమనించిన విజిలెన్స్ బృందం గోడౌన్‌లను సీజ్ చేసి, 6 ఏ కేసులు నమోదు చేశారు.

కార్యక్రమంలో విజిలెన్స్ తహసీల్దార్ వీఎస్ పాల్, ఎస్ఐ జి.నాగేశ్వరరావు, తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఏవో అబ్రహం లింకన్ పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో స్టాకు రిజిస్టరును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉష, ఏవో రంగాక్రిష్ణ

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

పీసీపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎరువులను అక్రమంగా నిల్వచేసి ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సీహెచ్ ఉష హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీసీపల్లిలో మంగళవారం వ్యవసాయ అధికారి ఎస్.రంగాక్రిష్ణతో కలిసి ఎరువుల దుకాణాన్ని తనిఖీచేశారు. వెంకటకామాక్షి దుకాణం మూతవేసి ఉండడంతో వీరవెంకటరమణ దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాకు రికార్డులను పరిశీలించిన ఆమె నిల్వచేసి ఉన్న ఎరువులను పరిశీలించారు. అనంతరం దుకాణ యజమానులతో ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించాలన్నారు. అధిక దరలకు విక్రయించినా, కావాలని ఉద్దేశపూర్వకంగా బ్లాక్ చేసినా చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి



ఒంగోలు బస్టాండు వద్ద షాపులోని రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను అగ్రికల్చర్ ఏడీ జైనులాబ్దిన్, తహసీల్దార్ రవిశంకర్‌తో కలిసి తనిఖీ చేశారు. షాపులలోని రికార్డుల ఆధారంగా స్టాకును పరిశీలించారు. యూరియా బస్తాల నిల్వలను పరిశీలించారు. రామాలయం వీధిలోని ఎరువుల దుకాణంలో స్టాకు రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణంలోని మన గ్రోమోర్ ఎరువుల గోడౌన్‌ను పరిశీలించారు. నిల్వలపై ఆరా తీశారు. అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయని గ్రోమోర్ కంపెనీ సిబ్బంది తెలిపారు.

భూగర్భ జలాలను పెంపొందించాలి



పెదయిర్లపాడులో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఏపీవో

పీసీపల్లి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంపొందించేందుకు అవసరమైన పనులు చేయాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని పెదయిర్లపాడు, వెంగళాయపల్లి గ్రామాల్లో ఇంకుడు గుంతలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంకుడు గుంతలు, ఫారమ్ పాండ్స్ తీయించడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. ఇందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించి ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తీయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కొండయ్య, టీఏ బాబూరావు, ఫీల్డ్ అసిస్టెంట్ చినబ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలి



తూర్పుగంగవరం సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యం

తాళ్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను సచివాలయ సిబ్బంది వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో సానికొమ్ము సత్యం పేర్కొన్నారు. మండలంలోని తూర్పుగంగవరం, మన్నేపల్లి, మాధవరం, తాళ్లూరు సచివాలయాలను మంగళవారం తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పలుసర్వేలను చేపట్టిందన్నారు. సర్వే చేయాల్సిన సచివాలయ ఉద్యోగులు అలసత్వం వహిస్తున్నందున సకాలంలో పూర్తికాక తాళ్లూరు మండలం జిల్లాలో వెనుకంజలో ఉందన్నారు. సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. సర్వేలు నిర్వహించటంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరచర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం యాప్‌ల ద్వారా సమాచారాన్ని పంపుతున్నందున వాటిని పరిశీలించి సర్వేలను త్వరిగతిన పూర్తిచేయాలన్నారు. ఆయా సచివాలయాల్లో రికార్డులనుపరిశీలించారు. సచివాలయ సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు.

పామూరు: గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేలను త్వరితిగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య సూచిం చారు. మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు

టీడీపీ సీనియర్ నేత మానం రమేష్‌బాబుకు సతీవియోగం



సుబ్బరత్నమ్మ (ఫైల్)

తాళ్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్‌బాబు సతీమణి సుబ్బరత్నమ్మ(54) మంగళవారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమె టీడీపీ సీనియర్ నాయకుడు నవులూరి సురేంద్రమోహన్ చెల్లెలు. ఆమె మృతిపట్ల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, బి.ఓబుల్‌రెడ్డి, గొంది రమణారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, శాగం కొండారెడ్డి, తదితరులు సంతాపం తెలిపారు. మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అరాచకాలకు మూల్యం తప్పదు!

దర్శి/ముండ్లమూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తల ఆస్తులను ధ్వంసం చేయటం పరిపాటిగా మారిందని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం దర్శిలో, ముండ్లమూరు మండలం పసుపుగల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. త్వరలోనే ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



● చిలకలూరిపేటలో అమెరికన్ డైమండ్స్‌తో గణనాథుని విగ్రహం.

గణపతి బప్పా మోరియా

- జిల్లా వ్యాప్తంగా చవితి ఉత్సవ శోభ
- పందిళ్లలో కొలువుదీరిన భారీ గణనాథులు
- పల్లె, పట్టణాల్లో చవితి పండుగ కోలాహలం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చవితి వేడుకలకు మండపాలు ముస్తాబయ్యాయి. బుధవారం వినాయక చవితి పర్వదినంతో జిల్లా అంతటా ఉత్సవశోభ నెలకొంది. పట్టణాలతో పాటు పల్లెల్లో కూడా గణపతి ఉత్సవాలకు భక్తులు భారీగా ఏర్పాట్లు చేశారు. రెండు దశాబ్దాలుగా బాపట్లలోని భావన్నారాయణ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న సంపత్ గణపతి పరివార్ ఈ ఏడాది కూడా మండపాన్ని అందంగా అలంకరించి 15 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. బాపట్ల కాకుమానువారిపాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చీరాలలో వస్త్రవ్యాపారులు పెద్ద మండపాలను సిద్ధం చేసి గణనాధుడి పూజలకు సిద్ధమయ్యారు. అద్దంకి, రేపల్లె, వేమూరు, పర్చూరుతోపాటు పలు గ్రామాల్లో కూడా ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. గత ఏడాది కంటే మండపాలు గణనీయంగా పెరగ్గా కార్యక్రమాలను ఆర్భాటంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు. సినీ సెట్టింగ్ తరహాలో చవి తి పందిళ్లను తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుత్ దీపా లతో పందిళ్లను శోభాయ మానంగా అలంకరించారు. చిన్నారులు నుంచి వృద్ధుల వరకు ఉత్సవాల్లో పాల్గొనేం దుకు ఉత్సాహం చూపు తున్నారు.



బాపట్ల రథం బజారులో చవితి పత్రి విక్రయం

ఉచిత విద్యుత్‌పై హర్షం..

రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం గణపతి ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ప్రకటించింది. ఈ మేరకు విద్యుత్‌శాఖకు మంగళవారం సాయంత్రం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు అధికారులు తెలిపారు. ఉచిత విద్యుత్ అమలుతో నవరాత్రులు నిర్వహించే ఉత్సవ కమిటీలతో పాటు ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ఆయా వర్గాలు కృతజ్ఞతలు తెలిపాయి. భక్తుల విరాళాలతో ఉత్సవాలను నిర్వహించే కమిటీలకు ఉచిత విద్యుత్ పెద్ద ఊరటగా మారింది. గతంలో మండపాలకు వినియోగించే విద్యుత్‌కు కిలో వాట్‌కు రూ.2,400 ట్రాన్స్‌కో వసూలు చేసేది. భారీ మండపాలకు దాదాపు 20 కిలో వాట్ల వరకు విద్యుత్‌ను వినియోగిస్తారు. ఈ ప్రకారం పెద్ద మండపాలకు రూ.18,900 నుంచి రూ.37,000 వరకు విద్యుత్ చార్జి ఖర్చయ్యేది. ఈ సారి ఉచిత విద్యుత్‌తో ఆ మేర భారం తగినట్లేనని ఉత్సవ కమిటీలు తెలిపాయి. ప్రతి మండపానికి బుధవారం సాయంత్రానికి మీటర్లు ఏర్పాటు చేసి ఏ మేరకు విద్యుత్ వినియోగించుకున్నారో రీడింగ్ తీసి ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. దీని ఆధారంగా ట్రాన్స్‌కోకు విద్యుత్ ఖర్చును ప్రభుత్వం చెల్లించనున్నది.





బాపట్ల : మట్టి వినాయక విగ్రహాలను విక్రయిస్తున్న దృశ్యం.

ఊరేగింపులు.. కొనుగోళ్ల సందడి..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వినూత్న రూపాల్లోని విగ్రహాలను అమ్మకాలకు సిద్ధం చేశారు. దీంతో తయారీదారుల నుంచి విగ్రహాలను కొను గోలు చేసిన ఉత్సవ నిర్వాహకులు ఊరేగింపుగా మండపాలకు తరలించారు. దీంతో మంగళవారం ఉదయం నుంచి ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. డప్పువాయిద్యాలతో యువకులు హడావుడి చేశారు. వినాయక ప్రతిమలు, పత్రి, పూజా సామగ్రి విక్రయాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. మంగళవారం వివిధ స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశాయి.



బాపట్ల : ట్రక్కు ఆటోలో వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళుతున్న యువత

9 గ్రామాలకు.. తీపికబురు

ఎస్సీ జనాభా ఎక్కువ ఉన్న పల్లెలకు రూ.40 లక్షలు

రోడ్లు, కాల్వలు, సామాజిక భవనాల నిర్మాణానికి వినియోగం



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తొమ్మిది గ్రామాలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న పంచాయతీలకు అదనపు నిధులను విడుదల చేసింది. ఎంపిక చేసిన గ్రామాల్లో రూ.40 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం వచ్చింది. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద రూ.20 లక్షలతో పాటు ఉపాధి హామీ పథకం నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా మరో రూ.20 లక్షలు ఎంపిక చేసిన ఒక్కో గ్రామానికి కేటాయించారు. ఎస్సీ జనాభాను ప్రామాణికంగా తీసుకుని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని గ్రామాలను ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎంపిక చేశారు. గ్రామ జనాభాలో ఎస్సీలు 50 శాతం కన్నా ఎక్కువ ఉంటారో ఆ గ్రామాలను ప్రస్తుతం ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తొమ్మిది గ్రామాల్లో ఎస్సీ జనాభా ఎక్కువ ఉంది కాబట్టి ఈ అదనపు నిధులు పొందేందుకు అర్హత సాధించినట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు ఎస్సీ జనాభా ప్రమాణికంగా విడుదలైనా ఖర్చు మాత్రం గ్రామంలో ఎక్కడ అవసరం ఉంటే అక్కడ వినియోగించుకోవచ్చు. సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, సామాజిక భవనాలు, తాగునీటికి అవసరం అయిన పనులను కూడా చేసుకోవచ్చు.

ఎంపికైన గ్రామాలు

గుంటూరు జిల్లా: ఐనవోలు (తుళ్లూరు), అన్నవరం (పెదనందిపాడు), బ్రాహ్మణ కోడూరు(పొన్నూరు) **బాపట్ల జిల్లా:** అనంతవరం, ఈపూరు (కొల్లూరు), ఈతేరు(బాపట్ల), మోపర్రు (అమృతలూరు) **పల్నాడు జిల్లా:** అందుకూరు (క్రోసూరు), ముతనపల్లి (రొంపిచర్ల)

గ్రామాభివృద్ధికి అవకాశం

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద విడుదలైన అదనపు నిధులతో గ్రామీణాభివృద్ధికి సువర్ణ అవకాశం వచ్చినట్లే. ఈ నిధులు వినియోగించి ఆయా గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు మెరుగు పర్చుకోవచ్చు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగు నీటి సరఫరా తదితర సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుంది.



- వీర్ల జ్యోతిబసు, సీఈఓ

అందుబాటులో లేని వ్యవసాయ శాఖ సిబ్బంది



మూసి ఉన్న కార్యాలయం

కొల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉండటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కార్యాలయానికి ఎప్పుడు వచ్చిన తాళం తీసి తలుపులు మాత్రం తీసి ఉంటాయని, సిబ్బంది మాత్రం ఒక్కరు కూడా కనిపించరంటూ రైతులు చెబుతున్నారు. మండల కేంద్రం కొల్లూరులోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయానికి ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు కోసం వచ్చిన రైతులకు కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. సీసీ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కౌలు రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది అవసరమైన పత్రాలు తెచ్చి ఇవ్వాలని ఫోన్‌లో సమాచారం అందిస్తారు. తీరా వాటిని తీసుకు వస్తే ఇక్కడ ఎవరు కనిపించరు. అసలు వ్యవసాయాధికారి ఎప్పుడు కార్యాలయానికి వస్తారో వెళతారో కూడా తెలియని పరిస్థితి. వివిధ పనులపై ఆ కార్యాలయానికి వచ్చిన రైతులు సిబ్బంది లేకపోవడంతో పక్కనే ఉన్న ఆధార్ సేవ కేంద్రంలోని సిబ్బందిని సంప్రదిస్తే వారు రైతు సేవా కేంద్రాలకు వెళ్లాలని చెప్పడంతో రైతులు చేసేదేమీ లేక ఆయా కేంద్రాలను వెతుక్కుంటూ వెళ్లాల్సి వసున్నది. ఇకనైనా కార్యాలయంలో అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరుతున్నారు.

బార్ లైసెన్సు.. సైలెన్స్

- దరఖాస్తులపై స్పందన నిల్
- బార్లపై ఆసక్తి చూపని వ్యాపారులు
- బాపట్ల జిల్లాలో 15 బార్లకు సున్నా దరఖాస్తులు
- గుంటూరు జిల్లాలో 92, పల్నాడులో 40 బార్లకు..
- మూడు జిల్లాలో 176 బార్లలో 29కి 75 దరఖాస్తులు
- మళ్లీ 29 వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన బార్ పాలసీపై వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. గత వైసీపీ హయాంలో ప్రభుత్వ వైన్స్‌ను తొలగించి ప్రైవేటుగా వైన్స్‌లకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలపగా పెద్ద ఎత్తున వ్యాపారులు ముందుకు వచ్చారు. దరఖాస్తు ఫీజుల రూపంలోనే రూ.కోట్లలో ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో బార్లకు కూడా పెద్దఎత్తున పోటీ వస్తుందని ప్రభుత్వం ఆశించింది. అయితే కనీస స్థాయిలో కూడా వ్యాపారులు స్పందించక పోవడం గమనార్హం. వైన్స్‌కు లాగానే ఒక్కొక్కరు ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా వ్యాపారుల నుంచి స్పందన లేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 176 బార్ల ఏర్పాటుకు ఈ నెల 18 నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా వాటిలో 75 మంది వ్యాపారులు ముందుకు వచ్చారు. ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఒక్కో బార్ లైసెన్స్‌కు కనీసం 4 దరఖాస్తులు రావాల్సి ఉంది. ఆ లెక్కన మూడు జిల్లాలో 176 బార్లకు 704 దరఖాస్తుల రావాల్సి ఉంది. అయితే 10.65 శాతం అంటే 75 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. బాపట్ల జిల్లాలో 15, గుంటూరు జిల్లాలో 92, పల్నాడులో 40 బార్లకు ఇప్పటి వరకు సున్నా దరఖాస్తులు రావడంపై అధికారులు ఆశ్చర్యపోతున్నారు. నగరపాలక సంస్థ, మున్సిపల్ పట్టణ, పంచాయతీల ప్రకారం బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్‌శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తులకు గడువు మంగళవారంతో ముగిసింది. పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రధాన పట్టణాల్లో కూడా బార్ల ఏర్పాటుకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు.

ఆర్థిక భారమని వెనకడుగు..

తొలుత బార్ల ఏర్పాటుకు ఆశావహులకు ప్రభుత్వం ఉచిత ఎన్‌రోల్‌మెంట్‌కు అవకాశం కల్పించింది. దీంతో ఎక్కడికక్కడ పలువురు పేర్లను నమోదు చేసుకున్నారు. తీరా దరఖాస్తుల విషయానికి వచ్చే సరికి వెనక్కి తగ్గారు. ఉచిత ఎన్‌రోల్‌మెంట్ తర్వాత ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.10,000 చెల్లించడంతో పాటు దరఖాస్తు రుసుం రూ.5,00,000 చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాలు నాన్‌రిఫండ్‌బుల్‌గా ప్రభుత్వం ప్రకటించింది. మార్గదర్శకాల ప్రకారం ఒక్కో షాపుకు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ ప్రక్రియ జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. మూడేళ్ల పాటు లైసెన్సును వర్తింపచేసేలా తొలి ఏడాదికి లైసెన్స్ రుసుం రూ.55 లక్షలు, రెండో ఏడాది రూ.60.50 లక్షలు, మూడో ఏడాది రూ.66.55 లక్షలుగా ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వీటిని బేరీజు వేసుకున్న వ్యాపారులు, ఆర్థికంగా భారమని తలచి దరఖాస్తులకు ముందుకు రాలేదని తెలుస్తోంది. పైగా మద్యం షాపులకు పర్మిట్ రూంలకు అనుమతి ఇవ్వడంతో వ్యాపారం సాగదని వ్యాపారులు బార్లకు దరఖాస్తు చేయడానికి ఆసక్తి చూపలేదన్న వాదన వినిపిస్తోంది. జిల్లాల్లో ఎక్కువగా వైసీపీకి చెందిన వ్యాపారులు బార్లు నిర్వహిస్తుండగా ప్రస్తుతం వారు తిరిగి ఆ వ్యాపారానికి ముందుకురానట్లు సమాచారం. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వ్యాపారులు మాత్రమే అక్కడక్కడ దరఖాస్తులు దాఖలు చేసినట్లు తెలిసింది. వచ్చే నెల 1 నుంచి నూతన బార్ పాలసీ అమల్లోకి వస్తుందని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. బార్ దరఖాస్తులకు వచ్చిన స్పందన మాత్రం అత్యంత తీసికట్టుగా ఉండడంతో (మిగతా 8వ పేజీలో)

● బాపట్ల జిల్లాలో 17 బార్లకు 68 దరఖాస్తులు రావాలి. అయితే 16 బార్లకు ఇంతవరకు స్పందనే లేదు. అద్దంకి పరిధిలోని ఓ బార్‌కు మాత్రం 5 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఒక్క బార్‌కు లైసెన్స్ ఫీజు తక్కువగా రూ.35 లక్షలు కావడం వల్లే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. జిల్లా కేంద్రమైన బాపట్ల లోని ఓ బార్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.



యూరియాకు కొరత లేదు

- రైతులకు అందుబాటులో ఎరువులు
- కర్లపాలెం మండలం పర్యటనలో కలెక్టర్



భోజనానికి విద్యార్థులతో కలిసి కూర్చున్న కలెక్టర్ జె. వెంకటమురళి

కర్లపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో ఎరువులు, పురుగు మందులకు ఎలాంటి కొరత లేదని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. కర్లపాలెం మండలం యాజలిలో ఉన్న యాజలి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్‌ను, కర్లపాలెంలోని మనగ్రోమోర్ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. దుకాణంలో ఇప్పటి వరకు వచ్చిన ఎరువులు, విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 500టన్నుల యూరియా అవసరం ఉండగా 950టన్నుల యూరియాను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అనంతరం కలెక్టర్ యాజలిలోని రైతు ఉత్పత్తిదారుల కంపెనీని పరిశీలించి నిర్వాహకుడు ఇక్కుర్తి నరసింహారావుతో మాట్లాడారు. వీరి వెంట ఆర్డీవో గోర్లియా, వ్యవసాయశాఖ ఏడి అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ ఏడి కరుణశ్రీ, ఏవో సుమంత్‌కుమార్, తహసీల్దార్ షాకీర్ పాషా, ఎంపిడివో ఐనంపూడి శ్రీనివాసరావు, పలుశాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇష్టంగా చదివించాలి

: ఉపాధ్యాయులకు సూచన

విద్యార్థి దశలో ఎలా చదివారో అలానే విద్యార్థులను ఇష్టంగా చదివించాలని యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. యాజలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనపథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతిరోజు ఇలానే భోజనం పెడుతున్నారా, రుచికరంగా ఉంటుందా, నాణ్యతతో తయారు చేస్తున్నారా, తిన్నంత భోజనం పెడుతున్నారా.. అంటూ బాలికలు నుండి వివరాలు అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ఏపీవో డీవీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో సురేష్, ఎంఇవోలు మనోరంజనీ, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ ఆంక్షలు తిప్పి కొట్టాలి

- ఆక్వాను జాతీయ రంగంగా గుర్తించాలి
- అమెరికా నిర్ణయాలపై వ్యతిరేకంగా రైతు సంఘాల ఆగ్రహం

చీరాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఆక్వాను జాతీయ రంగంగా గుర్తించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలను తిప్పి కొట్టాలని పలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం వేటపాలెం ఆక్వా అసోసియేషన్ కార్యాలయంలో ఆక్వా రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రంప్ సుంకాల నిర్ణయంతో వ్యవసాయ, అనుబంధ రంగాలు సంక్షోభంలో పడుతున్నట్లు వివరించారు. మరోవైపు సుంకాలు అమలు ప్రారంభం కాకమునుపే రాష్ట్రంలో వ్యాపారులు కౌంట్ రొయ్యలకు సంబంధించి ధరలు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. భారత దేశం వ్యయసాయాధారితం కావడంతో డబ్ల్యూటీవో ఒప్పందాల వలన పూర్తిగా రైతులు పరిస్థితి దీనంగా మారుతుందని ఆవేదన చెందారు. దేశీయ మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. దేశ ఎగుమతులపై అమెరికా సుంకాలు విధించడం అన్యాయమని చెప్పారు. సామాన్య రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా ప్రభుత్వాలు వెంటనే దృష్టి సారించాలన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ ధరలు తగ్గించాలని కోరారు. త్వరలో అఖిలపక్ష రైతు సంఘాలతో ఉద్యమించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నేతలు హరిబాబు, ఆమంచి స్వాములు, తేళ్ల రామయ్య, సూర్యనారాయణ, జయంతిబాబు, రామారావు, కొండయ్య, సిఐటియు నేతలు బాబురావు, అయ్యప్పరెడ్డి, రాంబాబు, జరుగుల రమేష్, వెంకట రామయ్య, శంకర్ తదితర రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘాల నేతలు

పరిపాలనాదక్షుడు చంద్రబాబు

- అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన
- పమిడిపాడు సభలో మంత్రులు పార్థసారథి, రవికుమార్

మేదరమెట్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షుడని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం రాత్రి మండలంలోని పమిడిపాడులో సీసీరోడ్లు, జలసిరి పథకం, బస్సు షెల్టర్‌తో పాటు ఎస్సీకాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవాలు జరిగాయి. అనంతరం ఎన్టీఆర్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రావి ఆంజనేయులు కాంస్య విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందన్నారు. పేదల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకుని వారి సంక్షేమానికి కృషి చేస్తున్న చంద్రబాబుకు, పరదాలు కట్టుకుని తిరిగిన జగన్‌మోహన్‌రెడ్డికి పోలిక ఎక్కడని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం రూ.1000 పెన్షన్ పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకోగా చంద్రబాబు ఒక్కసారే అంతమొత్తం పెంచా రన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వైసీపీ పూర్తిగా మూలన పడేసిందని, కూటమి అధికారంలోకి రాగానే రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లతో పాటు రాయితీపై విత్తనాలను కూడా అందించినట్లు తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చాక మిత్రుడైన రావి నరేష్ తండ్రి ఆంజనేయులు సంస్మరణ సభలోనే తొలిగా రాజకీయ వేదిక ఎక్కినట్లు గుర్తు చేసుకున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయడం ద్వారా ప్రజల రుణం తీర్చుకుంటున్నట్లు తెలిపారు. మేదరమెట్ల, రాచపూడి రోడ్డు రెండు లేన్లుగా అభివృద్ధి చేయడానికి ఇప్పటికే ముఖ్యమంత్రితో మాట్లాడానన్నారు. నరేష్ సొంత నిధులతో బస్ షెల్టర్ నిర్మించడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, వేదికపై మంత్రి పార్థసారథి, దామచర్ల సత్య, తదితరులు

పమిడిపాడు సొసైటి ఛైర్మన్‌గా జయకృష్ణ ప్రమాణం

పమిడిపాడు సొసైటీ ఛైర్మన్‌గా జాగర్లమూడి జయకృష్ణ, సభ్యులుగా తల్లపనేని శ్రీనివాసరావు, మాలెంపాటి లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు అందుబాటులో ఉండి వారి అవసరాలను తీర్చాలని మంత్రులు కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమాల్లో మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ కామేపల్లి సీతారామయ్య, ఏఎంసీ ఛైర్మన్ పద్మావతి, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, ఎన్ఆర్ఐ రావి నరేష్, డాక్టర్ ఈడుగంటి హృదయనాథ్, ప్రాసమణి, జాగర్లమూడి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు లేక గుమ్మడి రైతులు లబోదిబో

● కిలో రూ.20 నుంచి రూ.5కు పడిపోయిన ధర ● ఖర్చులు కూడా చేతికి అందే పరిస్థితి లేదంటున్న రైతులు

బల్లికురవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఆశతో గుమ్మడి పంట సాగు చేసిన రైతులు కొనుగోళ్ల లేక లబోదిబోమంటున్నారు. గతంలో ఆశాజనకంగా ఉన్న గుమ్మడి దరలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో రైతులు పెట్టుబడికూడా వచ్చే పరిస్థితి లేదని లబో దిబో మంటున్నారు. ధరలు తగ్గడమే కాక కాయాలను కూడా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎవరు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు హైదరాబాద్ మార్కెట్‌కు అయిన కాయాలను తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తామని వాహనాలను ఏర్పాటు చేసుకొని వెళుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న గుమ్మడికాయలు, హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాయలు

బల్లికురవ మండలంలోని బల్లికురవ, నక్కబొక్కల పాడు, కొత్తపాలెం, కొప్పెరపాలెం, గంగపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి, రామాంజనేయపురం, ఎస్ ఎల్ గుడిపాడు, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో పలువురు రైతులు ఎర్ర గుమ్మడి తోటలను సాగు చేశారు. ఎకరాకు రూ. 25 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట దిగుబడులు మాత్రం అంతంత మాత్రంగా వచ్చాయి. ఎకరాలకు 3 నుండి 4 టన్నుల వరకు గుమ్మడి దిగుబడులు వచ్చాయి. ధర మాత్రం అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు బెంబేలెత్తి పోతున్నారు. ఎంతో ఆశతో సాగు చేశామని ధరలు తమను నష్టాల ఊబిలోనికి నెడుతున్నాయని రైతులు అంటున్నారు.



బల్లికురవలో రైతులు సాగు చేసిన గుమ్మడి తోట

పలు ప్రాంతాలలో ఎక్కువ మంది రైతులు గుమ్మడి సాగు చేయడంతో మార్కెట్‌కు పెద్ద ఎత్తున కాయలు వస్తున్నాయని అందువలనే దరలు తగ్గాయని రైతులు వాపోతున్నారు. గత నెలలో కిలో రూ.20 వరకు ఉందని ఇప్పుడు రైతుల వద్ద గుమ్మడి కాయలు దిగుబడులు వచ్చే సరికి మెదట్లో కిలో రూ. 10 ఉండగా ఇప్పుడు రూ.6 కే కొనుగోలు చేస్తామని అంటున్నారని రైతులు తెలిపారు. ధర లేకపోవడంతో కొంత మంది రైతులు కాయకోయకుండానే వదిలేస్తున్నారు. ఈ ఏడాది గుమ్మడి నష్టాలను మిగిలిస్తోందని రైతులు వాపోతున్నారు.

వాహనచోదకులకు పొంచి ఉన్న ప్రమాదం

భారీ వాహనాలతో పగిలిన కల్వర్టు

అద్దంకి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ లో రేణింగవరం రోడ్డులోని కల్వర్టు పగిలిపోయింది. దీంతో వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. కాకానిపాలెం వైపు నుంచి వచ్చే మురుగు నీరు దామావారిపాలెం వద్ద ఉన్న మెయిన్ డ్రైన్‌లో కలిసే విధంగా భవానిసెంటర్‌లో రేణింగవరం రోడ్డుకు కల్వర్టు ఏర్పాటు చేశారు. అయితే కల్వర్టుపై నిత్యం వందల టిప్పర్లు గ్రావెల్ విజయవాడ-బెంగళూరు రోడ్డుకు తరలిపోతుండడంతో కల్వర్ట పగలింది. దీంతో



కల్వర్ట్‌పై వెళుతున్న భారీ వాహనం, గోతికి అడ్డుగా పెట్టిన పోస్టులు (ఇన్‌సెట్)

గోతిలో కర్ర ఉంచి చుట్టూ దిమ్మెలు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వెంటనే కల్వర్టుకు పడ్డ గొయ్యి పూడ్చే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పంక్చర్ షాపు వద్ద యువకులు హల్‌చల్

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

అద్దంకి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో యువకులు పంక్చర్ దుకాణం వద్ద హల్‌చల్ చేశారు. అద్దంకి పట్టణంలోని పోతురాజుగండి వద్ద ఉన్న పంక్చర్ దుకాణం వద్దకు మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు యువకులు స్కూటీ తీసుకొచ్చి పంక్చర్ వేయించుకున్నారు. పంక్చర్ వేసినందుకు డబ్బులు అడగడంతో మద్యం మత్తులో ఉన్న యువకులు గొడవపడి హల్‌చల్ చేశారు. దీంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.



యువకులను పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్తున్న పోలీసులు

రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం : మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సూచించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మంగళవారం రైల్వేశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలతో పాటు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ పనుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే వాటిని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే ఏడీఈ శంకరరావు, ఆర్‌వీఎస్ ఎల్సైట్ ఇంజనీర్ రాధాకృష్ణ, ఆర్‌ఎస్పీ సుందర్‌సింగ్, డీఆర్ రవికుమార్, డీఆర్‌యూసీ సభ్యులు నాదెండ్ల మనోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంతకు కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే ఎంపీ మాగుంటను రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ చైర్మన్ బోడపాటి తేజస్వీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాంస్కృతికంగా ఒంగోలును అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

'యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు..'

కొండపి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు, ఏవో మాల్యాద్రి ఎరువుల డీలర్లను హెచ్చరించారు. మంగళవారం కొండపి లోని పలు ఎరువుల దుకాణాలను అధికారులు పరిశీలించారు. ఎరువుల స్టాక్‌ను, రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసినపుడు తగిన రశీదులు తీసుకోవాలని, డీలర్లు ఎమ్మార్పీ ధరలకు అమ్మాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలో పాల్గొన్నారు.

వెల్లంపల్లిలో

మద్దిపాడు: యూనియాను ఎరువులు అధిక ధరకు విక్ర యిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవోస్వర్ణలత హెచ్చరించారు. వెల్లంపల్లిలోని పురుగుమందుల షాపును ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో కలిసి ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు రమణయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ హిత విగ్రహం



ఒంగోలు మండలం మండవవారిపాలెంలో వినాయకచవితిని పురస్కరించుకుని గ్రామానికి చెందిన సీహెచ్.రామయ్య మట్టితో భారీ వినాయక విగ్రహాన్ని రూపొందించారు. ఇందుకోసం ఆయన సుమారు ఆరురోజుల పాటి కష్టపడి రూపొందించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ విగ్రహ నిర్మాణం కోసం లోపలి భాగం వరిగడ్డి వాడినట్లు తెలిపారు. అలాగే ఏడు బస్తాల నల్లరేగడి మట్టి పూతతో వినాయక విగ్రహం తయారు చేసినట్లు చెప్పారు. దీనివల్ల ఎలాంటి పర్యావరణ కాలుష్యం ఉండదన్నారు. ఈ గణేషుడి విగ్రహాన్ని గ్రామస్థులు గ్రామలోని శ్రీకోదండరామ స్వామివారి దేవాలయంలో చవితి పూజా కార్యక్రమాలకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విగ్రహాన్ని తిలకించేందుకు స్థానికులు ఉత్సాహం చూపుతున్నారు.

- ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన



మట్టితో తయారు చేసిన విగ్రహాలతో విద్యార్థులు

చీమకుర్తి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతే మహా గణపతి అని, పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ పాటుపడాలంటూ పల్లామల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థులు అందరికీ అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని పర్యావరణ హితం కోసం విద్యార్థులు హెచ్‌ఎం జీవి స్వర్.సాయి పర్యవేక్షణలో మంగళవారం పాఠశాలలో మట్టి గణపతి ప్రతిమలను తయారుచేశారు. మట్టి విగ్రహాలకే పూజలు చేస్తామంటూ ప్రతిన పూనారు.

పండుగను ప్రశాంతంగా చేసుకోవాలి

యద్దనపూడి,(మార్టూరు)ఆగ స్టు26(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను జాగ్రత్తగా, ప్రశాంతంగా, ఎలాంటి గొడవలు చేసుకోకుండా జరుపుకోవాలని పర్చూరు సీఐ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం యద్దనపూడి పోలీస్ స్టేషన్ లో మండలంలో వినాయకుని బొమ్మలను ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులతో పోలీసులు సమావేశం ఏర్పాటుచేశారు. .ఈ సందర్భంగా వారితో సీఐ మాట్లాడుతూ విగ్రహాలను మండపానికి తీసుకువస్తున్న సమయంలో, యువకలు ఊరేగింపుగా,వచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా మండపాలు వద్ద ఏమైనా గొడవలు జరిగితే నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు.అనంతరం వారందరికి పండుగ శుభాకాంక్షలను తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ టిరత్నకుమారి,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థుల వార్షికోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కాంట్రాక్ట్, స్టాఫ్ నర్సుల అసోసియేషన్ 5వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు కే శరత్‌బాబు, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు ఉదయలక్ష్మీ, జనరల్ సెక్రటరీ కొత్తపల్లి మంజేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడం సేవగా భావించాలన్నారు. విధుల నిర్వహణలో ఐక్యతతో మెలగాలని, సంఘం మరింత బలోపేతం అయి, హక్కులు సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సుమన్, జోయెల్, నర్సింగ్ సిబ్బందిపాల్గొన్నారు.



వేడుకలలో పాల్గొన్న నర్సులు

పంచాయతీల అభివృద్ధి ద్వారానే గ్రేడ్‌లు

అద్దంకిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉన్న వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి చేయడం ద్వారానే గ్రేడ్‌లు కేటాయించినట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. మంగళవారం పంచాయతీ పురోగతి సూచిక 2.0పై మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి 9 అంశాల ద్వారా 164 సూచికలతో కొలుస్తారన్నారు. వీటి ఆధారంగానే గ్రామ పంచాయతీలకు గ్రేడింగ్‌లు ఇస్తారన్నారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కోటేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరా, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధర రూ. 266.. అమ్ముతోంది రూ.300

కొత్తపట్నంలో యూరియా విక్రయాల్లో వ్యాపారుల ఇష్టారాజ్యం
జేసీ తనిఖీల్లో బహిర్గతం
కేసు నమోదు చేసిన అధికారులు

కొత్తపట్నం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : సాగు సమయం ఆసన్నమైంది.. రైతులు యూరియా కోసం పరుగులు పెడుతున్నారు.. ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇలాంటి సమయంలో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు నిలువుదోపిడికీ దిగుతున్నారు. ఎరువులు పురుగుమందుల దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యమైంది. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జేసీ గోపాలకృష్ణ నేరుగా రంగంలోకి దిగారు. మంగళవారం కొత్తపట్నంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీంతో వ్యాపారుల అసలు గుట్టురట్టయ్యింది. యూరియా బస్తా రూ.266కు అమ్మాల్సి ఉండగా రూ.300కు అమ్ముతున్నారు. కొత్తపట్నంలోని శివాలయం వీధిలో ఉన్న షా ఎంటర్‌ప్రైజెస్ దుకాణాన్ని జేసీ తనిఖీ చేశారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. యూరియా బస్తా ఎంతకు అమ్ముతున్నారంటూ వాకబు చేశారు. రూ.300లకు విక్రయిస్తున్నారని చెప్పటంతో షా ఎంటర్‌ప్రయిజెస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. అంతేగాక దుకాణంలో ఉన్న 4.86 మెట్రిక్ టన్నుల యూరియాను సీజ్ చేశారు. అనంతరం ఆయన రాజుపాలెంలోని బాలాజీ ఏజెన్సీస్‌లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఆ ప్రాంతంలోని రైతులతో కూడా జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కిషోర్ బాబు తదితరులు ఉన్నారు.



రైతుతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

వ్యవసాయాధికారుల సమీక్షలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సాగులో ఉన్న పంటలకు అవసరమైన ఎరువులు, యూరియా రైతులకు సరిపడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్కడా యూరియ కొరత ఏర్పడకుండా రైతులకు అవసరమైన మేరకు ఎరువులను వెంటనే అందచేయాలని, కేటాయించిన యూరియా పూర్తిగా స్థానిక రైతులకు అందేలా చూడాలని అన్నారు. ఎరువులు బయటకు మళ్లించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

సామాన్యుడిలా ఉండడం ఇష్టం

● సినీ నటుడు అజయ్‌ఘోష్

నాగులుప్పలపాడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడిలా ఉండటం ఇష్టమని సినీ నటుడు అజయ్ ఘోష్ చెప్పారు. ఒంగోలు నుంచి తన స్వగ్రామం వేటపాలేనికి స్కూటీపై వెళుతున్న నటుడు అజయ్ ఘోష్ మంగళవారం నాగులుప్పలపాడులోని ఓ టీ దుకాణం వద్ద ఆగారు. దాంతో స్థానికులు ఆయనతో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా అంటే వినోదం కాదని సమాజానికి సందేశాన్ని అందిస్తాయని చెప్పారు. అలాంటి చిత్రాలు ఎన్నో నటించడం వల్లనే తనకు ఇంత గుర్తింపు లభించిందన్నారు. ఒకప్పుడు థియేటర్లలో విజిల్స్ కొట్టిన తాను ఇప్పుడు వారితోనే నటించడం గర్వంగా ఉందని చెప్పారు. పక్కా కమర్షియల్, రంగస్థలం, పుష్ప లాంటి సినిమాలతో ప్రేక్షకులను ఎంతగానో ఆదరించారన్నారు. ఇప్పటికీ తాను అందరితో కలసి సరదాగా ఉండటం షూటింగ్ లేని సమయంలో స్నేహితులు, బంధువులతో సామాన్యుడిగా మెలగడం ఎంతో ఇష్టమన్నారు.



అజయ్ ఘోష్‌తో స్థానికుడు

అవీ..ఇవీ..

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనుల వద్ద పరిశీలిస్తున్న జేసీ గంగాధర్‌గౌడ్

అద్దంకి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం సందర్భంగా పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ మంగళవారం సాయంత్రం పనులను పరిశీలించారు. ప్రధానంగా అద్దంకి, పంగులూరు మండలాలలో పలు చోట్ల భూమి కోల్పోయిన రైతులకు ఇంకా పరిహారం అందకపోవడం, పలు గ్రామాల వద్ద రైతుల అవసరాలకు అనుగుణంగా వంతెనలు, నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల రైతులు మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకు పోయారు. దీంతో ఆయా సమస్యలను మంగళవారం సాయంత్రం రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. రైతులు తమ సమస్యలను వివరించారు. అద్దంకి, పంగులూరు తహసీల్దార్లు శ్రీచరణ్, శింగారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని విగ్రహాల పంపిణీ



మార్టూరులో రాయల్ స్కూల్‌లో వినాయకుని ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

మార్టూరు : వినాయకచవితి పర్వదినం సందర్భంగా మంగళవారం మార్టూరు రాయల్ స్కూల్‌లో విద్యార్థులకు స్కూలు యాజమాన్యం మట్టితో తయారుచేసిన వినాయకుని విగ్రహాలను పంపిణీ చేసింది. అంతేగాకుండా బాలబాలికలు వినాయకుని ప్రతిమ ఆకారంలో కూర్చొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ పేరం రవీంద్రబాబు, ఇన్‌చార్జ్ కే.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా కుట్టు శిక్షణను పూర్తి చేయాలి

ఒంగోలునగరం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న మహిళల కుట్టు శిక్షణను ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన ఒంగోలులోని బాలాజీనగర్‌లో జరుగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు నేర్చుకున్న శిక్షణ వారి జీవనోపాధికి ఉపయోగం పడేలా ఉండాలన్నారు. మహిళలు మాట్లాడుతూ ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈడీకి తెలిపారు. రకరకాల దుస్తులు ఏ విధంగా కుట్టాలి, ప్రత్యేకించి మహిళలు, చిన్న పిల్లల దుస్తులు కుట్టుపై పూర్తి స్థాయిలో శిక్షణ తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌వీ.రాఘవ, సీహెచ్.శ్రీనుబాబు మాట్లాడుతూ గత కొన్నేళ్ళ నుంచి హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందిస్తూ వస్తున్నామని చెప్పారు. అనంతరం మట్టివినాయక ప్రతిమలు, కథ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్‌ను సమర్థంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న దేవకుమార్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లాడి దేవకుమార్ కోరారు. ఒంగోలులోని ఎంసీఏ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఎస్ఓపీని క్షుణ్ణంగా అర్థం చేసుకుని దళిత గిరిజనుల సంఘ నాయకులు పనిచేయాలని తెలిపారు. సబ్ ప్లాన్ నిధుల ద్వారా దళిత, గిరిజనుల నివాస ప్రాంతాలు, కుటుంబం, వ్యక్తి అభివృద్ధికి కృషి చేయాలని చట్టం చెబుతుందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ సిటిజన్ ఆడిట్ నివేదిక ప్రకారం, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల అత్యాచారాల నివారణకు ఈ చట్టం వచ్చిందని చెప్పారు. సమావేశంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ ఎం. హేమలత, బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్ గురజాల రాజేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రఘురామ్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీచర్లకు ఉద్యోగోన్నతి పత్రాల అందజేత

ఒంగోలు విద్య, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ మంగళవారం స్థానిక సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఆరుగురు సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. డీఈవో కిరణ్ కుమార్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

బార్ లైసెన్సు.. సైలెన్స్

(7వ పేజీ తరువాయి)

ఈ నెల 29 వరకు గడువు పెంచింది. అప్పటికీ దరఖాస్తుల విషయంలో ఇదే రీతిలో స్పందన ఉంటే తదుపరి ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

- గుంటూరు జిల్లాలో 110 బార్లు ఉండగా కేవలం 18 బార్లకు మాత్రమే 47 దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఆరు బార్లకు నాలుగు, మంగళగిరిలో మూడు బార్లకు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి.
- పల్నాడు జిల్లాలో 49 బార్లలో 9 బార్లకు మాత్రమే 22 దరఖాస్తు వచ్చాయి. సత్తెనపల్లిలో మూడు బార్లకు 10, దాచేపల్లి, గురజాలలో ఒక్కో బార్‌కు నాలుగు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. చిలకలూరిపేటలోని 10, పిడుగురాళ్లలో 6, మాచర్లలోని 4, వినుకొండలోని 6 బార్లకు ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 17 బార్లకు నాలుగు బార్లకు మాత్రమే దరఖాస్తులు దాఖలయ్యాయి.

అవీ..ఇవీ..

కుందేరు ప్రక్షాళనకు సన్నద్ధం

- ఆక్రమణలపై ఇప్పటికే అంచనా
- త్వరలో పరిశీలన..అనంతరం చర్యలు
- అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కుందేరు ఆక్రమణల ప్రక్షాళనపై పాలకులు, అధికారులు సన్నద్ధమయ్యారు. అందుకు సంబంధించి కలెక్టర్ వెంకటమురళీ, ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ తగు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కుందేరు వాగు బాపట్ల మండలంలో 97.20 ఎకరాలు, చీరాల మండలంలో 276.72 ఎకరాలు, వేటపాలెంలో 656.06, చినగంజాంలో 452.98 ఎకరాలు విస్తీర్ణంలో సహజ సిద్ధంగా విస్తరించింది. తద్వారా తుఫాన్, వరదలతో పాటు, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కవచంలా ప్రయోజకరంగా ఉంది. అయితే కాలక్రమేణ వాగు ఆక్రమణలతో బక్కచిక్కింది. ఒక్క చీరాల డివిజన్ పరిధిలోనే సుమారు 143 అనధికార నివాసాలు ఏర్పడ్డాయి. కబ్జా కోరల్లో ఉన్న కుందేరును అభివృద్ధి పరచి భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరంగా ఉండేందుకు పాలకులు, అధికారులు కొంతకాలంగా సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలోనే ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి అంచనాకు వచ్చారు. దీనికి సంబంధించి ఎమ్మెల్యే కొండయ్య అధికారులతో సమీక్షించారు. సర్వే నివేదికను కలెక్టర్‌కు అందించి అంచనాకు రానున్నారు. త్వరలోనే ఆక్రమణలపై చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయండి

చీరాల : నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్లమెంట్, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలపై మాట్లాడారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని వివరించారు. అంతకు ముందు పట్టణంలోని మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుతో లో-వోల్టేజీ సమస్యకు పరిష్కారం

బల్లికురవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు అధికంగా ఉండే గ్రామాలలో లోవోల్టేజ్ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేయిస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ అంజనేయులు తెలిపారు. మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి ఎస్ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం మల్లాయపాలేనికి సబ్‌స్టేషన్ మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వభూమి 67 సెంట్లలో త్వరలో నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటైతే గ్రానైట్ పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో లోపాలు ఉండవన్నారు. అలానే గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్రిఫేజ్ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు పనులు ప్రారంభిసామన్నారు. ఈ పరిశీలనలో మార్టురు ఏడీఈఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతమైన వ్యక్తి మదర్‌థెరిస్సా

అద్దంకిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): అతిచిన్న వయస్సులోనే సేవారంగంలోకి వచ్చిన మహోన్నత వ్యక్తి మదర్ థెరిస్సా అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం సాయంత్రం రోటరీ కార్యాలయంలో థెరిస్సా 115వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ అలహరి హరిప్రసాద్, డాక్టర్ యు. దేవపాలన, సందిరెడ్డి శ్రీనివాసరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి కోలాహలం

- పలుచోట్ల మట్టి ప్రతిమల పంపిణీ
- భాగస్వామ్యమైన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు
- పూజా సామగ్రికి డిమాండ్



చీరాలలోని మార్కెట్ సెంటర్‌లో పూజాసామగ్రి కోసం భక్తుల రద్దీ

చీరాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వినాయక చవితి కోలాహలం నెలకొంది. గణనాధుని ప్రతిమలు, ప్రతుల కోసం ప్రజలకు మార్కెట్ కూడలి కి రావడంతో ఆ ప్రాంతం అంతా రద్దీగా మారింది. చీరాల కూరగాయల మార్కెట్, క్లాత్‌మార్కెట్‌లతో పాటు, ఈపూరుపాలెం, వేటపాలెం గడియార స్తంభం కూడలిలో రద్ధీ పెరిగింది. భక్తులు, చిన్నారులు, మహిళలు ఉదయం నుంచే వినాయకుని ప్రతిమలు, ప్రతులు కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్దకు బారలు తీరారు.

నిమజ్జనాలపై ప్రత్యేక దృష్టి సారించండి

వినాయక నిమజ్జనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. మంగళవారం డీఎస్పీ ఎండీ మొయిన్‌తో కలిసి అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్, వాడరేవు, రామాపురం, కఠారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం తీర ప్రాంతాల్లో నిమజ్జనాలకు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. విపత్కర పరిస్థితులలో వెంటనే ఆయా శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

చీరాల : ప్రతి ఒక్కరు మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని చీరాల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రూ.28వేల విలువైన 1500 మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. అందరూ ఆనందంగా పండుగను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. పట్టణంలోని గడియార స్తంభం కూడలిలో ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, అమర్‌చంద్, సుబ్బారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సురేష్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అద్దంకి : మండపాలలో కొలువుదీరేందుకు గణనాథులు తరలి వెళ్లారు. బుధవారం వినాయక చవితి నేపథ్యంలో వీధి వీధిన పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. అద్దంకిలోని తయారీ కేంద్రాల నుంచి సుమారు 300కు పైగా వినాయక విగ్రహాలను పట్టణంతో పాటు అద్దంకి, ముండ్లమూరు, తాళ్లూరు, బల్లికురవ, సంతమాగులూరు, పంగులూరు, కొరిశపాడు తదితర మండలాలలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసేందుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా బుల్లి వినాయకులను తీసుకెళ్లారు. పట్టణంలోని పాతబస్టాండ్ కూడలిలో పూజా సామగ్రి అమ్మకాలతో రద్దీ ఏర్పడింది. దీంతో సందడి నెలకొంది.

మట్టి వినాయక ప్రతిమలనే ఉపయోగించండి

అద్దంకిటౌన్ : ప్రకృతి కాలుష్యం, జలకాలుష్యం లేని మట్టివినాయక ప్రతిమలనే భక్తులందరూ ఉపయోగించాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం పట్టణంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సందర్భంగా తమ కార్యాలయం వద్ద పట్టణ ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ అలహరి హరి ప్రసాద్, చిన్ని మురళీకృష్ణ, మహ్మమద్‌రఫీ, వీరయ్య, రామకోటేశ్వరరావు, అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో బాలికల ప్రదర్శన

వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. పర్యవరణ కాలుష్యాన్ని నివారించేందుకు భక్తులు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పీడీ కృష్ణారావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గణనాథుని మట్టి ప్రతిమల పంపిణీ

పర్చూరు : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ గంగా వద్ద మంగళవారం 650 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయ భాస్కర్, వెంకన్న, కాసా అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మట్టి విగ్రహాల పంపిణీ

చినగంజాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వినాయక చవతి పండుగను పురస్కరించుకొని పాఠశాలలోని ఈకో క్లబ్, ఈగల్ క్లబ్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వలన పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. పర్యావరణానికి హాని లేని మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, మీ చుట్టుపక్కల వారు కూడా వాడేట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.నరసింహా రావు, సుబ్బారావు, కోటిరెడ్డి, నాగేశ్వరరావు, రామ్ కుమార్, ఈకో క్లబ్ ఉపాధ్యాయులు ఉదయభానేశ్వరి, జ్యోతి, ఈగల్ క్లబ్ ఉపాధ్యాయులు ఏ.అరుణకుమారి, ప్రసాద్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.






చిన్నగంజాంలో మట్టిప్రతిమలతో విద్యార్థులు, అద్దంకిలో బుజ్జి గణపయ్యను తీసుకెళుతున్న చిన్నారులు, అద్దంకిలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంపిణీ

మొక్కుబడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

- కోరం లేక మూడు గంటలు నిలిచిన సమావేశం
- సభ్యులకు ఫోన్ చేసి పిలిపించిన ఏఎంసీ చైర్మన్

సంతమాగులూరు ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. సమావేశం 11 గంటలకు ఎంపీపీ ఏనుబర్ల ఎల్లమంద అధ్యక్షతన ప్రారంభం కాగా ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. అయితే ఎంపీడీవో జ్యోతిర్మయితో పాటు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్ హాజరయ్యారు. అయితే సభ్యులు లేకపోవడంతో ఒకింత విస్మయానికి గురై సభ్యుల కోసం ఎదురు చూశారు. సమయం 12:30 అయ్యేసరికి అధికారికంగా సమావేశం ప్రారంభం కాగా, గంటన్నరకు అధ్యక్ష హోదాలో ఎంపీపీ ఉండగా మరో ముగ్గురు ఎంపీటీసీలు చవిటిపాలెం ఎంపీటీసీ సభ్యులు లీలావతి రాధాకృష్ణమూర్తి, సంతమాగులూరు సభ్యుడు పిట్టమడుసుల కాంతారావు, సజ్జాపురం ఎంపీటీసీ శ్రీనివాసరావుతో పాటు కో ఆప్షన్ సభ్యులు షైకంటి మస్తాన్‌వలి (ఉక్కు) సమావేశ మందిరంలోకి వచ్చారు, అయితే మండల పరిషత్ మొత్తం పాలకవర్గ సభ్యులు 17 మంది కాగా, కోఆప్షన్ సభ్యులతో కలిసి మొత్తం 18 మంది, సమావేశం కోరం ఉండాలంటే మూడో వంతు కంటే ఆరుగురు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలి, ఆరవ సభ్యుడు ఎవరు రాకపోవడంతో అటు అధికారులతో పాటు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరైన సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు తేలప్రోలు రమేష్ కాస్తంత విస్మయానికి గురయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన రమేష్ ఎంపీటీసీలకు సభ్యులకు ఫోన్ చేసి రావాల్సిందిగా కోరారు, మధ్యాహ్నం 1.30 వరకు సమావేశం జరుగుతుందా..? లేదా..? అన్న ఉత్కంఠ నడిచింది. పలువురు అధికారులు సైతం మౌనంగా అక్కడే ఎదురుచూస్తూ కనిపించారు. ఎట్టకేలకు ఎల్లల చెరువు ఎంపీటీసీ సభ్యురాలు సభ్యురాలు మేకల లక్ష్మి సమావేశానికి హాజరయ్యారు. దీంతో ఆమెతో సంతకాలు చేయించుకుని, కోరం సరిపోవడంతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే మధ్యాహ్న భోజన సమయం మించిపోవడంతో ఎజెండాలు, చర్చలు, ప్రగతి నివేదికలు, ఏమీ లేకుండానే సమావేశాన్ని మమా అనిపించేశారు. సమావేశంలో ఎంపీపీ ఏనుబర్ల ఎలమంద, తహసీల్దార్ కే.రవిబాబు, నల్లూరి శివరాం ప్రసాద్, ఏడుగురు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కోటయ్య



అద్దంకి,ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): అద్దంకి కోర్టులో అదనపు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా బత్తుల రామకోటయ్యను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. సంతమాగులూరు మండలం పుట్టావారి పాలేనికి చెందిన బత్తుల రామకోటయ్య గత 25 సంవత్సరాలుగా అద్దంకిలో నివాసం ఉంటున్నారు. అద్దంకి, ఒంగోలు కోర్టులలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. బత్తుల రామకోటయ్య ప్రస్తుతం టీడీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు గా ఉన్నారు. అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో ఏజీపీగా మూడేళ్ల పాటు సేవలందించనున్నారు. తనకు సహకరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు రామకోటయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులపై అసిస్టెంట్ మేనేజర్ వేధింపులు మానుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్మికులను వేధింపుకలకు గురి చేయడం మానుకోవాలని స్టాఫ్‌అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు అన్నారు. మంగళవారం అద్దంకి బస్టాండ్ ఆవరణలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యప్పరెడ్డి మాట్లాడుతూ కలెక్షన్లు తక్కువగా వస్తున్నాయని కార్మికులను అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్ వేధించడం రోజు పరిపాటిగా మారిందన్నారు. దీంతో కార్మికులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారన్నారు. అధికారులు ఇలాంటి వేధింపులు మానుకోవాలన్నారు. బైపాస్ సర్జరీ చేయించుకున్న ఏడీసీ జయసింహారెడ్డికి ఒంగోలు బదిలీ అయితే రిలీవ్ చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని, వెంటనే ఏడీసీని రిలీవ్ చేయాన్నారు. డిపోలో ఉన్న సమస్యలను పరిష్కారంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. 300 మంది కార్మికులు ఉన్న డిపోలో కనీసం మరుగుదొడ్డి, తాగునీటి వసతులు లేవన్నారు. బస్సులో చార్జింగ్ పాయింట్‌లు కూడా లేవని వీటన్నింటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి డీఏవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, ఆర్‌టీసీ కార్మికులు, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లపై వివక్ష తగదు



మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్

అద్దంకిటౌన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్, లింగ మార్పిడి వ్యక్తులపై వివక్ష తగదని సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ జి.రమేష్ అన్నారు. మంగళవారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, దిశాల ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ టోల్ ఫ్రీ నంబర్ 1097పై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జండర్స్‌కు సంస్థ ఔట్రిచ్ వర్కర్ టి. దుర్గాభవాని తన సొంత నిధులతో నిత్యవసర పంపిణీ చేశారు.

జలజీవన్ మిషన్ పనులను పరిశీలించిన అధికారులు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

యద్దనపూడి,(మార్టూరు) ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాలలో నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పనులను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డి.అనంతరాజు, డీఈ సతీష్‌చంద్రలు పరిశీలించారు. గన్నవరం గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ నుంచి ఇంటింటికి పైపులైను పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా పూనూరు గ్రామంలో జరుగుతున్న పైపులైను పనులను అధికారులు పరిశీలించారు. అందుకు సంబంధించి పలు సూచనలను ఈఈ అనంతరాజు ఏఈ చైతన్య, ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజా, నల్లపనేని రంగయ్యచౌదరి, బోయపాటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

46 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, ఆగస్టు26 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలో పలు రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ వైద్యం చేయించుకున్న 46 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయ్యాయి. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం చిలకలూరిపేట లోని మంత్రి నివాసం లో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

75 గణేష్ విగ్రహాల ఏర్పాటుకు దరఖాస్తులు

బల్లికురవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవతి పండగ సందర్భంగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు 75 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేశారని ఎస్ఐ వై. నాగరాజు తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసే వారు ప్రభుత్వం విధించిన నిబంధనలను పాటించాలన్నారు. ప్రతి విగ్రహం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాటకచేరీలు, డీజేలతో అసాంఘీక కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. గణేష్ విగ్రహాలను నిర్వాహకులు గ్రామాలకు మంగళవారం ఉదయం నుంచే తరలించారు. సంబరాలతో గణనాధులను గ్రామాలలోకి అహ్వానించారు.

బర్లీ పొగాకు సాగు చేయొద్దు

అద్దంకిటౌన్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు బర్లీ పొగాకు సాగు చేయవద్దని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మంగళవారం వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పొగాకు సాగును ప్రభుత్వం ఈ పంట కాలానికి నిషేధించినట్లు తెలిపారు. గ్రామంలో మినుములో పంటను పరిశీలించి రసం పీల్చే పురుగుల నివారణకు ఇమిడా క్లోప్రిడ్ మందును ఒక ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అంజరెడ్డి, బోనిగల ఎలిశమ్మ, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ మౌనిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమకొరత సృష్టిస్తే కఠినచర్యలు

- వ్యవసాయశాఖ ఏడీ, తహసీల్దార్ హెచ్చరిక



రేణింగవరంలో గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

పంగులూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధికధరలకు విక్రయించినా, కఠినచర్యలు తీసుకుంటామని ఏడీ.సుదర్శనరాజు, తహసీల్దార్ సింగారావు హెచ్చరించారు. పంగులూరులోని మనగ్రోమోర్, రేణంగివరంలోని జయఆగ్రో ఏజెన్సీస్ ఎరువుల దుకాణాలను త్రిసభ్య కమిటీ తనిఖీ చేసింది. దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులను, రికార్డులను పరిశీలించారు. రేణంగావరంలో డిటర్జంట్‌బార్ల తయారీ కేంద్రమైన శివవిఘ్నేశ్వర పరిశ్రమలో తనిఖీలు నిర్వహించారు. రైతులకు రాయితీపై అందజేసే యూరియాను డిటర్జెంట్ల తయారీలో వినియోగిస్తున్నారనే విషయంపై ఆరాతీశారు. ఎలాంటి అవకతవకలు లేవని గుర్తించినట్లు తెలిపారు. రైతాంగానికి నిర్ణీత ధరలకు అందించాల్సిన ఎరువుల విషయంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని దుకాణం యజమానులను సూచించారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కొండమూరు, జనకవరంలో పొలంపిలుస్తోంది

అంతకు ముందు కొండమూరు, జనకవరం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పురుగు మందులను తగు మోతాదులోనే వినియోగించాలన్నారు. కౌలురైతులు తగిన గుర్తింపుకార్డులు పొదడంతో పాటు పంటనమోదు చేసుకుని తగిన ప్రయోజనాలు పొందాలని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. 2025-26 సంవత్సరానికి నల్ల,తెల్ల బర్లీపొగాకు నారుమడులుసాగు, పంటసాగు నిషేదించామన్నారు.


పండ్లతోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



మామిడి మొక్కను పరిశీలిస్తున్న ఏపీడీ

చినగంజాం, ఆగస్టు 26 (ఆంధ్ర జ్యోతి) : పండ్లతోటలను సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని చీరాల క్లస్టర్ ఏపీడీ కోటనాయక్ అన్నారు. మండల పరిధిలోని మున్నంవారిపాలెం, కడవకుదురు, మొటుపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరై సాగు చేస్తున్న మామిడి తోటలను మంగళవారం ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలో మిగిలిన రైతులందరూ పండ్ల తోటలను వెంటనే వేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈసీ. సురేష్, టెక్నికల్ అసిస్టెంట్లు మారుతీ సుదర్శన్, జైరావు శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు వడ్లమూడి రామకృష్ణ, నాగార్జున, పున్నాగులరెడ్డి, ఆయా గ్రామాల పండ్ల తోటల రైతులు పాల్గొన్నారు.

'సోమశిల'లో 58.080 టీఎంసీల నిల్వ



అనంతసాగరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి 22,868 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాంలో 58.080 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,400, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.



పూజా సామగ్రి కొనుగోలు చేస్తూ

గణపయ్య భలే ఉన్నాడు.. కదా!





కలిగిరి : మా విఘ్నేశ్వరుడికి దిష్టంతా పోవాలి!



ఎన్ని బొజ్జ గణపయ్య ప్రతిమలో...?

ఏ పని ప్రారంభించాలన్నా తొలిపూజ చేసేది విఘ్నేశ్వరుడికే!. గణాలకు అధిపతిగా, విఘ్నాలను తొలగించే స్వామిగా గణేశుడిని కొలుస్తారు. ఆ లంబోదరుడిని ఊరూరా పూజించే పండుగే వినాయక చవితి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో వినాయక ఉత్సవ మండపాలను ఏర్పాటు చేశారు. 8వేలకు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించి సామూహిక పూజలకు ఉత్సవ కమిటీలు సిద్ధమయ్యాయి. చవితి ఉత్సవాలు సమైక్యతకు చిహ్నం. ఒక ప్రాంతంలోని వారంతా సమూహంగా ఏర్పడి సమన్వయంతో జరుపుకునే పండుగ. దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ప్రజల్లో సమైక్యతను పెంపొందించేందుకు బాలగంగాధర్ తిలక్ బహిరంగంగా గణేశ్ ఉత్సవాలు చేసే సంస్కృతికి నాంది పలికారు.

మహా గణపతిం భజే!!

- నేడు వినాయక చవితి
- సమైక్యతను పెంచే పండుగ
- ఊరూరా సంబరాలు
- భారీగా మండపాలు.. 8వేలకుపైగా విగ్రహాలు
- ఉచిత విద్యుత్‌పై హర్షాతిరేకాలు

ఎక్కడి వాహనాలు అక్కడే



వినాయక చవితి అంటే ప్రకృతి పండుగ. పర్యావరణం విలువ, ప్రయోజనాలు తెలియజెప్పే పండుగ. వినాయకుని ప్రతిమను ప్రకృతిలోని మట్టి నుంచి చేస్తారు. గణపతికి అర్పించే 21 రకాల పూజా పత్రి ఔషధ గుణాల కలిగిన మొక్కల నుంచి సేకరిస్తారు. గజాననుడికి నైవేద్యంగా సమర్పించే పండ్లు, చెరకు గడలు అన్నీ ప్రకృతి ప్రసాదమే. పూజించిన పత్రిని నిమజ్జనం రోజు నీటిలో కలపడం ద్వారా వాటిలోని ఔషధ గుణాలు ఆ నీటిలో కలిసి పశుపక్ష్యాదులకు ఆరోగ్యాన్నిస్తాయి.



● ఆడంబరాలతో అనర్థాలు

ఆధునిక సమాజంలో విపరీత పోకడలకు పోయి సహజసిద్ధంగా జరుపుకోవాల్సిన పండుగను హంగు, ఆర్భాటాలు, పోటీతత్వం, అవగాహన లోపంతో కాలుష్య కార కంగా మార్చేస్తున్నారు. రసాయనాలతో కూడిన, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్లలో సైతం చాలా మంది పీవోపీ విగ్రహాలను పూజించి నిమజ్జనం చేస్తున్నారు. ఒక ఏడాది కాలంలో ఏర్ప డేంత కాలుష్యాన్ని వినాయక చవితి పండుగ పేరుతో ఒక్కరోజులోనే మనకు మనమే కొనితెచ్చుకొంటున్నాం. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వం, యంత్రాంగం చేతులెత్తేయడం తో చవితి పండుగ ప్రకృతి వినాశకంగా మారుతోంది. కొంతలోకొంత ప్రైవేటు, స్వచ్ఛంద సం స్థలు బాధ్యత తీసుకుని మట్టి గణపతి పూజ, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడమేకాక మట్టితో చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగానూ పంపిణీ చేస్తుండటం ఊరటనిచ్చే అంశం.

● భారీ మండపాలు... ఎందరికో ఉపాధి

నెల్లూరు నగరంలో వినాయక చవితికి భారీ ఎత్తున మండపాలు నిర్మించారు. ఆలయాలు, రాజప్రాసాదాలను పోలిన సెట్టింగులను సిద్ధం చేశారు. వీటి నిర్మాణంతో వేలాది మందికి పని దొరి కింది. అలాగే ఉత్సవాలు ఐదు రోజులు నిర్వహించనున్న నేపథ్యంలో పూలు, పూలమాలలు, హైర్స్, విద్యుత్ లైటింగ్, అర్చకులు, మిఠాయి దుకాణాలు, పండ్లు దుకాణాలు, ప్రసాదాల తయారీ, భోజన క్యాటరింగ్, ఆర్కెస్ట్రా కళాకారులకు ఉపాధి లభిస్తుంది. ఇదిలా ఉండగా ఈ ఏడాది గణేష్ మండపాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ వసతి కల్పించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.


- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు: లస్సీ సెంటర్‌లో ఆకట్టుకున్న విద్యుద్దీప అలంకరణ

మట్టి గణపతులనే పూజిద్దాం

- ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, సీఎంఆర్ చందనా బ్రదర్స్ ఆధ్వర్యంలో గణేశ్ ప్రతిమల పంపిణీ





మట్టి వినాయక ప్రతిమలను చూపుతున్న సీఎంఆర్ చందన బ్రదర్స్ డైరెక్టర్ సంతోష్ రామ్మోహన్, రాజీ యాడ్స్ పెంచలయ్య, తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, సీఎంఆర్ చందన బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ప్రజలకు మట్టి గణపతుల ప్రతిమలను అందజేశారు. ట్రంకురోడ్డులోని ఆ షాపింగ్ మాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎంఆర్ చందన బ్రదర్స్ అధినేత మావూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ సంతోష్ రామ్మోహన్, వెంకటగణేష్, ప్రతినిధి శైలేష్, రాజీ యాడ్స్ పెంచలయ్య, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి జి.రామకృష్ణ, ఏడీవీటీ మేనేజరు అబ్దుల్ రహీం, ఏబీఎన్ ఇన్‌చార్జ్ మహేష్, స్టాఫ్ రిపోర్టర్ యు.అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీ యాడ్స్ పెంచలయ్య మాట్లాడుతూ పర్యావరణం కాపాడుదాం-మట్టి గణపతులను పూజిద్దాం అనే నినాదంతో 20 సంవత్సరాలుగా మట్టి గణపతిలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో సీఎంఆర్ షాపింగ్ మాల్, చందనా బ్రదర్స్ కంచి కామాక్షి షోరూమ్‌లలో ఖాతాదారులకు, భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

కందుకూరు గడ్డ..
పేకాటకు అడ్డా!

- రేయింబవళ్లు జోరుగా జూదం
- మాలకొండ, రామాయపట్నం పరిసరాల్లో శిబిరాలు
- పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి జూదగాళ్ల రాక
- చేతులు మారుతున్న రూ.కోట్ల నగదు
- పేకాటరాయుళ్లకు పోలీసుల దీవెనలు?
- ప్రతిరోజూ రూ.2లక్షల వరకు మామూళ్లు
- ఉలవపాడు సమీపంలో శిబిరం...

ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెలుగులోకి..

'మీకేం కాదండీ. రాజకీయ ముఖ్యనేతలతో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అన్నీ నేను చూసుకుంటాను. మీరొచ్చి ఆడుకోండి. మా వాటా మాకిస్తే చాలు.'

- జూదరులకు కందుకూరు పరిసరాల్లోని ఓ వ్యక్తి ఇస్తున్న భరోసా ఇది.

కందుకూరు నియోజకవర్గం పేకాటకు అడ్డాగా మారిపోతోంది. పవిత్ర పుణ్యక్షేత్రం మాలకొండ పరిసరాలు, రామాయపట్నం పోర్టు పరిసరాల్లో కొన్ని నెలలుగా ఆర్గనైజ్డ్ పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు కోట్లాది రూపాయలు జూదంలో చేతులు మారుతోంది. శిబిరాలవైపు కన్నెత్తి చూడకుండా పోలీసులకు రమారమి రూ.2 లక్షలకుపైగా మామూళ్లు ముట్టజెబుతున్నట్టు సమాచారం. పోలీసులకు ఎవరైనా ఫిర్యాదుచేసినా వారి సమాచారం నిమిషాల్లో నిర్వాహకులకు వెళ్తుండటం వారు రంగంలోకి వచ్చి బెదిరింపులకు దిగుతున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. కందుకూరు మున్సిపల్ పరిధిలోని ఓ వ్యక్తి అన్నీ తానై వ్యవహిస్తూ ఈ తతంగం నడుపుతున్నట్లు తెలుస్తోంది.

- వివరాలు 8లో..



రామాయపట్నం పరిసరాల్లోని ఓ అతిథిగృహంలో కోసు పేకాటలో పాల్గొన్న జూదగాళ్లు

బార్లకు దరఖాస్తు గడువు 29 వరకు పొడిగింపు

గీతకులాలతో కలిసి 30న లాటరీ ● ఐదు దరఖాస్తుల దాఖలు

నెల్లూరు(క్రైం): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన బార్ల పాలసీకి వ్యాపారుల ఆదరణ లభించకపోవడంతో దరఖాస్తు గడువును ఈ నెల 29వ తేదీ వరకు పెంచింది. జిల్లాలో 50 బార్ల ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. గీత కులాల వారికోసం ఐదు బార్లు కేటాయించారు. మంగళవారం వరకు గడువు విధించారు. అయితే సోమవారం వరకు ఒక్క దరఖాస్తు రాలేదు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఐదు దరఖాస్తులు దాఖల య్యారు. కందుకూరులోని ఒక బారుకు నాలుగు దరఖాస్తులు, మరో బారుకు ఒక దరఖాస్తు మాత్రమే వ్యాపారస్తులు వేశారు. నూతన పాలసీ ప్రకారం ఒక్కో బారుకు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు గడువు పెంచడంతో గీతకులాల వారికి కేటాయించిన బార్లతోపాటే అన్నీ బార్లకు ఈ నెల 30వ తేదీన లాటరీ తీయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

టీడీపీ జిల్లా పగ్గాలు
ఎవరికో!?

- బరిలో నలుగురు ముఖ్యనేతలు
- త్రీమెన్ కమిటీకి దరఖాస్తుల అందజేత
- అనుబంధ కమిటీలకూ పలువురు దరఖాస్తు
- మంత్రులు, ఎమ్మెల్యేలతోనూ కమిటీ సమావేశం
- అధిష్ఠానానికి నివేదిక ఇవ్వనున్న త్రీమెన్ కమిటీ
- నాయకులతో విస్తృతస్థాయి సమావేశం



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు సత్యప్రసాద్, ఆనం, నారాయణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు

నెల్లూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పదవిపై ఉత్కంఠ నెలకొంది. నలుగురు ముఖ్య నేతలు ఈ పదవికి పోటీ పడటంతో ఎవరికి దక్కేనో అన్న ఆసక్తి మొదలైంది. ప్రస్తుత అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్‌లు ఆశావాహుల జాబితాలో ఉన్నారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎంపికతోపాటు అనుబంధ సంఘాల ఎంపికకు సంబంధించి టీడీపీ అధిష్ఠానం నియమించిన త్రీమెన్ కమిటీ మంగళవారం నెల్లూరులో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి త్రీమెన్ కమిటీ సభ్యులైన మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, దూండి రాకేష్‌లతోపాటు జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డిలు హాజరయ్యారు. ముందుగా టీడీపీ జెండాను ఆవిష్కరించిన నేతలు పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. తదుపరి జిల్లా నేతలు, కార్యకర్తలతో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మంత్రులు ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన పోరాటాలు, కార్యకర్తల కృషిని గుర్తు చేశారు. కమిటీల ఎంపికకు సంబంధించి పార్టీ విధివిధానాలను వారు వివరించారు. అనంతరం జిల్లా కమిటీ, అనుబంధ కమిటీల నియామకానికి సంబంధించి ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సుమారు 50 మందికిపైగా వివిధ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ త్రీమెన్ కమిటీ స్వీకరించింది.

● ముఖ్యనేతల నుంచి అభిప్రాయాల సేకరణ

జిల్లా అధ్యక్ష పదవి కోసం అజీజ్, వెంకటేశ్వర్లరెడ్డి, పట్టాభిరామిరెడ్డి, చెంచలబాబు యాదవ్‌లు ఆసక్తి కనబరిచినట్లు తెలిసింది. వీరు తమ ఆసక్తిని త్రీమెన్ కమిటీకు తెలియజేశారు. అనంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో త్రీమెన్ కమిటీ వన్ టు వన్ సమావేశమైంది. అధ్యక్ష పదవితోపాటు ఇతర పదవులపై వారి అభిప్రాయాన్ని తెలుసుకుంది. ముఖ్య నేతలంతా తమ అభిప్రాయాన్ని కాగితం మీద తెలియజేసి కమిటీకి అందజేశారు. ఈ అభిప్రాయాలన్నింటినీ త్రీమెన్ కమిటీ సభ్యులు రహస్యంగా ఉంచారు. వీటన్నింటినీ క్రోడీకరించి ముగ్గురు నేతలతో కూడిన ప్రతిపాదనలను టీడీపీ అధిష్ఠానానికి అందజేయనున్నారు. అలానే వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అనుబంధ సంఘాల ఎంపికకు సంబంధించి కూడా ఒక నివేదికను త్రీమెన్ కమిటీ అధిష్టానానికి అందజేయనుంది. ఎక్కువ మంది ఇద్దరు నేతల వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. ఆ ఇద్దరి నేతల్లోనే ఎవరో ఒకరికి అధ్యక్ష పదవి దక్కే అవకాశాలున్నట్లు టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. విస్తృతస్థాయి సమావేశం నేపథ్యంలో టీడీపీ జిల్లా కార్యాలయం నాయకులు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది.

డీఎస్సీ అభ్యర్థులకు
రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు(విద్య), ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025కు సంబంధించి మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం నుంచి జరగనుంది. అన్ని సబ్జెక్టుల మెరిట్ జాబితాలను ఇప్పటికే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నేపథ్యంలో వివిధ కేటగిరి పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో ఆర్ బాలాజీరావు తెలిపారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ద్వారా కాల్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. అందులో సూచించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇటీవల జారీ చేసిన కులధ్రువీకరణ పత్రం, అంగవైకల్యం ఉంటే ఆ ధ్రువీకరణ పత్రం, కాల్‌లెటర్‌లో సూచించిన ఇతర పత్రాలు, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకుని వారికి సూచించిన సమయానికి హాజరు కావాలన్నారు. హాజరు కాని, అర్హత లేని వారి స్థానంలో జాబితాలో తర్వాత ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ముందే ఆయా సర్టిఫికెట్లను వెబ్ సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థులందరూ నిబంధనలు పాటిస్తూ నెల్లూరులోని వీఆర్ ఐపీఎస్ ప్రాంగణంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు సమయానికి హాజరు కావాలని కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 540

నేతల వినాయక చవితి శుభాకాంక్షలు

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ ప్రజలకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవరావు, మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దివి శివరాం, బుర్రా మధుసూదన్‌యాదవ్ తదితరులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీవో

వలేటివారిపాలెం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లె సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో నరేంద్రదేవ్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సర్వేయర్ శింగయ్య విధులకు గైర్హాజరు కావడంతో జీతం నిలిపివేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. అలాగే పోకూరు, అంకభూపాలపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎస్.తిరుమలరావు, ఎన్.సుబ్బానాయుడు, జీ.బెంజిమెన్, ఎం.నాగభూషణం, జీ.చెంచురామయ్య, బాబూరావులు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు.

పేద అర్చకుడికి ఆర్థిక సాయం

కావలి(టౌన్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ముసునూరు రామాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న బాబురావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన పేద అర్చకుడి వైద్యం, ఇంటి ఖర్చులకు మంగళవారం కావలి బ్రాహ్మణ మహా సంఘం నేతలు రూ.29వేల ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, గుర్తింపు కార్డుల పంపిణీ

బిట్రగుంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు ఆర్ఎస్ఆర్ ట్రస్ట్ కన్వీనర్ మెతుకు రాజేశ్వరమ్మ మంగళవారం టై, ఐడీ కార్డులను ఎంఈవో ఎం.జయమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే సరస్వతి నమస్తుభ్యం మండల చైర్మన్ ఎం.ప్రసాద్ రావు విద్యార్థులచే మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. వారికి ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. అదేవిధంగా ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయిని డేగా విజితను ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సుజాత సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు వీవీ బ్రహ్మయ్య, విజయలక్ష్మీ, సీఆర్పీలు రవి, చెన్నయ్య ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు హెచ్చరించారు. మండలంలో మంగళవారం ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వింజమూరు, కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.శేషగిరి, నాగరాజు, అల్లూరు వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాడవాడలా 'చవితి' సందడి



పూజా సామగ్రి విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

కావలి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని మంగళవారం నుంచే వాడవాడలా సందడి నెలకొంది. పూజాసామగ్రి, వివిధ ఆకృతులలోని వినాయకుని ప్రతిమలతో కావలి పట్టణం కళకళలాడుతోంది. పట్టణంలో ట్రంకురోడ్డుకు ఇరువైపులా దానికి అనుబంధంగా ఉన్న రోడ్లలో గణనాథుని పూజకు అవసరమైన గణనాథుని చిన్న చిన్న ప్రతిమలతో పాటు అన్ని రకాల పూజా సామగ్రితో ట్రంకురోడ్డు నిండి పోయింది. మంగళవారం సాయంత్రం నుంచే ప్రజలు వినాయకచవితి పూజకు అవసరమైన అన్ని రకాల పూజా సామగ్రి కొనుగోలుకు ట్రంకు రోడ్డుకు చేరు కోవటంతో ప్రజలతో కిటకిట లాడుతోంది. రోడ్డుకు ఎటు వైపు చూసినా వినాయక ప్రతిమలు, అరటి పిలకలు, వాటికి అవసరమైన గొడుగులు, వివిధ రకాల ఆకులు, ఫలాలు తదితర అన్ని వస్తువులు అందుబాటులో ఉంచటంతో పట్టణం ఆకర్షణీయంగా కనిపించింది.

ఉచితంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

కావలి మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ సౌజన్యంతో మంగళవారం సాయంత్రం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఉచితంగా వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను విజయవాడ నుంచి ప్రత్యేకంగా తెప్పించి ప్రతిమలతోపాటు వినాయక పూజకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త, ఓరుగంటి రామకృష్ణ, కంచర్ల చక్రి, గాదంశెట్టి మధుసూదనరావు, బచ్చు వీరా స్వామి, యేల్చూరి రవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత మట్టి వినాయకులను మంగళవారం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో కనిగిరి రోడ్డులో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసంఘం సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచు రామయ్య, దాసరి శ్రీను, ఉన్నం వీరాస్వామి, చక్కా కేశవ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పెద్దబజారులో బోణాల శ్రీనివా సచక్రవర్తిలు మట్టి విగ్రహాల పంపిణీ చేశారు.

గ్రామాలకు తరలిన గణనాథులు

కలిగిరి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తయారీ కేంద్రాల నుంచి గణనాథులు మంగళవారం గ్రామాలకు తరలివెళ్లారు. యువత ట్రాక్టర్లు, ఆటోలను తీసుకువచ్చి తాము కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలకు కాయ కర్పూరంతో పూజా కార్యాక్రమాలు నిర్వహించి తరలించారు. దీంతో గ్రామాల్లో పండగ సందడి మొదలైంది.

వినాయకుడిని పూజించడం శుభప్రదం



విగ్రహాలను కొనుగోలు చేస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ముక్కోటి దేవతలో ప్రథమ పూజలందుకునే వినాయకస్వామిని పూజించడం శుభప్రదమని టీడీపీ మండల రైతు నాయకుడు ఇందుపూరు రామోహన్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీలోని గిరిజన, అంబేడ్కర్, హరిజనవాడలకు వినాయక విగ్రహాలను వితరణ చేశారు. మంగళవారం విగ్రహాలను కొనుగోలు చేసి నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు నాటకరాణి రంగయ్య, భాస్కర్, శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల వేషధారణ



గణపతి వేషధారణలో విద్యార్థులు

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని నార్తుమోపూరులోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో మంగళవారం వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు గణపతి వేషధారణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గణపతి వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్, ఖాజారంతుల్లా పాల్గొన్నారు.

ముందస్తు వేడుకలు



మేదరమెట్లపాలెం అంగన్వాడీ కేంద్రంలో పూజలు చేస్తున్న ఐసీడీఎస్, అంగన్వాడీ సిబ్బంది

లింగసముద్రం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని సెక్టార్ పరిధిలోని మేదరమెట్లపాలెం అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గణనాథుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఉండ్రాళ్లు, కుడుములు, లడ్డూలు, పులిహోర నైవేద్యంగా సమర్పించారు.

● **వలేటివారిపాలెం :** మండలంలోని నేకునాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో వినాయకుడు విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవి, పంచాయతీ కార్యదర్శి నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు రాధ, భారతి పాల్గొన్నారు.



నేకునాంపురంలో వినాయచవితి వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రతీ వీధిలో గణేశ్ ప్రతిమల ఏర్పాటు

కావలి(టౌన్),ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతీ విధిలో వినాయక విగ్రహాల ఏర్పాటు చేస్తున్నారు. ముసునూరులో ఉన్న విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద మంగళవారం యువత విగ్రహాలు కొనుగోలు చేసి వాహనాల్లో తరలించారు. పట్టణంలోని ప్రతి వీధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వస్త్ర వ్యాపార సముదాయాల్లో, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక సెట్టింగులు, విద్యుదీపాలంకరణలతో ఆకర్షణీయంగా ము స్తాబు చేశారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ పర్యవేక్షణలో పెద్దఎత్తున చవితి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. మానస సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో భారీ ఎత్తున ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



గణపయ్య ప్రతిమలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం



కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టరు హిమవంశీ

కందుకూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలందరికీ స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 1వ వార్డు ఏకలవ్యనగర్‌లో మంగళవారం ఉదయం సబ్ కలెక్టరు దామెర హిమవంశీతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి స్మార్ట్‌రేషన్‌కార్డుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.అనూష, తహసీల్దారు లావణ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నాయకులు కృష్ణారెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పొడపాటి మాధవ, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

'ఉల్లాస్ అక్షర ఆంధ్ర'కు జీవం పోయాలి

అల్లూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమానికి జీవం పోయాలని అడల్ట్ ఎడ్యుకేషనల్ డివిజినల్ సూపర్‌వైజర్ ఓంకారం శిరీష అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు వెలుగు పరిధిలో 150 మందిని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిధిలో 100 మందిని వలంటీర్లుగా ఎంపిక చేయనున్నారన్నారు. శిక్షణ తీసుకున్న వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఇన్‌చార్జి ఎంపీడీవో పెంచల వీరేంద్ర, ఎంఈవో రవీంద్రనాథ్, రిసోర్స్ పర్సన్ నాగరాజారావు, ఏపీఎం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి వేడుకలు



మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేస్తున్న డాక్టర్ ప్రభాకర్ నాయుడు

కావలి(టౌన్), ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): విశ్వమాత మదర్ థెరిస్సా జయంతి వేడుకలను మంగళవారం డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆసుపత్రి వద్ద వివిధ స్వచ్ఛంద సంస్థల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్, డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ప్రసాదరావు, దిలీప్, సలీమ్, సురేంద్ర, ఘనీబాషా, రఫీ అహ్మద్, మాల్యాద్రి నాయుడు, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చవితి పందిళ్లు.. రంగు రంగుల భారీ గణనాథుల ప్రతిమలు.. అన్నప్రసాద వితరణలు.. మహిళా భక్తుల కోలాహలం.. యువత సందడితో వినాయక చవితి వేడుకలు మళ్లీ వచ్చాయి. గతం కంటే భిన్నంగా సమైక్యత చాటుతూ వాడవాడలా ఉత్సవ కమిటీ సారథ్యంలో వేడుకలకు సిద్ధమయ్యాయి. పదిమందిని ఒక్కచోటుకు చేర్చి సమైక్య భావాలను పెంపొందింపచేస్తున్నాయి.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

రారండోయ్.. వేడుక చేద్దాం!

- సమైక్యతను పెంచుతున్న గణనాథులు
- వీధివీధికి పెరుగుతున్న ఉత్సవ కమిటీలు
- నూతన పరిచయాలకు వేదికగా వేడుకలు
- నేటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు

జిల్లాలో వినాయక చవితి వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా మొదలుకానున్నాయి. భిన్నసంస్కృతులు.. సంప్రదాయాలు కలగలిసిన సమాజంలో అందరినీ ఒకతాటిపైకి తీసుకొస్తున్నాయి చవితి వేడుకలు. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన ఈ వేడుకలు ఇప్పుడు ఊరూరా వ్యాపించాయి. వీధివీధిన చవితి పందిళ్లు ఏర్పాటు చేసి సమైక్యతను చాటుకుంటున్నారు.

● భిన్నమతాల ఐక్యతకు తోడ్పాటు

చవితి వేడుకలకు చందాలు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఈ వేడుకల్లో అందరినీ భాగస్వామ్యం చేయడమే దీని పరమార్థం. ఈ క్రమంలో స్థానికంగా నివసిస్తున్న భిన్నమతాల వారు కూడా ఈ వేడుకలు విజయవంతం అయ్యేందుకు చందాలు ఇచ్చి సహకరించడంతోపాటు అనేక ఇతర కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఇది ఆయా ప్రాంతాల్లో సుహృద్భావ వాతావరణానికి ఎంతగానో దోహదం చేస్తుంది.



● పరిచయాలకు వేదికగా...

పట్టణ ప్రాంతాల్లో 70 శాతం మందికిపైగా వేర్వేరు ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే ఉంటారు ఇటువంటి వారికి ఒకరినొకరు పరిచయం కావడానికి చవితి వేడుకలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా అపార్టుమెంట్లు సంస్కృతి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో సమైక్యతకు ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. చవితి ఏర్పాట్లతో సమావేశాలు ప్రారంభమైన ఈ పరిచయాలు వేడుకలు ముగిసేనాటికి కుటుంబ సభ్యులుగా మారుతున్నారు.

● గ్రామాల్లో వేడుకలు

గ్రామాల్లో ఒకప్పుడు ఉత్సవాలంటే దసరా, శ్రీరామనవమి, గ్రామదేవతకు జరిపే తిరునాళ్లే. ఆయా సమయాల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారంతా సొంతూళ్లకు చేరిపోతారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు గ్రామాల్లో కూడా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించడం సంప్రదాయంగా మారింది. ఒకప్పుడు తిరునాళ్లకు గ్రామాలు వెళ్లేవారు ఇప్పుడు చవితి వేడుకలకూ వెళుతున్నారు.

● పోలీసులు డేగకన్ను

వినాయక ఉత్సవాలు అంటే భారీ హంగామా ఉంటుంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఈ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఈ ఉత్సవాలపై నిఘా పెట్టారు. వివాదాస్పద ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.



25వేల రుద్రాక్షలతో వినాయక ప్రతిమ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో 25 వేల రుద్రాక్షలతో మహాగణపతిని ఏర్పాటు చేశారు. ప్రతి వినాయక చవితికి వెరైటీ పర్యావరణ గణపతులను ఏర్పాటు చేస్తున్న సీఎంఆర్ అధినేతలు ఈసారి ఐదుగురు కళాకారులు 10 రోజులు శ్రమించి ఈ ప్రతిమను తీర్చిదిద్దారు. అలాగే, కాలుష్య రహిత గణపతి ప్రతిమల తయారీపై విద్యార్థులు, చిన్నారులకు పోటీలు జరగ్గా, విజేతలకు బహుమతులు అందజేశారు.



పరికుంటపాడులో ఆరుబయటే ఉన్న స్టీలు

ఆరుబయట స్టీలు భద్రమేనా!?

● గుట్టురట్టవుతుందని హౌసింగ్ అధికారుల ఆందోళన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కాలనీలు కాదు... గ్రామాలను నిర్మిస్తామని గొప్పలు చెప్పి, నిధుల దుర్వినియోగానికి పాల్పడింది. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 98,781 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టగా, అందులో సుమారు 29,246 ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించింది. అదే అదునుగా కాంట్రాక్టర్లు కొంత మంది అధికారులతో కుమ్మక్కై అవినీతికి తెర లేపారు. భారీ మొత్తంలోనే ఇళ్లకు కేటాయించాల్సిన సిమెంటు, స్టీలును పక్కదారి పట్టించి జేబులు నింపుకున్నారు.

కాగా ఇటీవల ఉదయగిరి మండల హౌసింగ్ ఏఈ రామకృష్ణ తన అనుచరుల ద్వారా దుత్తలూరు మండల గోదాము నుంచి స్టీలును అక్రమంగా తరలించేందుకు పూనుకున్నారు. ఈ బాగోతంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేయడంతో హౌసింగ్, విజిలెన్స్ ఉన్నతాధికారులు విచారణ చేపడుతున్నారు. ఈ క్రమంలో గతంలో ఇతర మండలాల్లోను అవినీతికి పాల్పడిన మరికొంతమంది అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తమ గుట్టు ఎక్కడ రట్టవుతుందోనని లోలోన మదనపడుతున్నారు. ఇదంతా ఒకవంతైతే మిగిలిన మండలాల్లోను నిల్వ ఉన్న స్టీలు భద్రమేనా, లెక్కకు సరిపోతాయా? అన్న అనుమానాలు సైతం వ్యక్తమవు తున్నాయి. వరికుంటపాడులోనూ అప్పటి అధికారులు అవసరం లేకపోయినా కమీషన్లకు కక్కుర్తి పడి ఏకంగా 36 టన్నుల స్టీలు కొనుగోలు చేశారు. దీంతో ఆరుబయటే ఉన్న ఆ స్టీలును చూసిన ప్రజలు కనీసం ఇదైనా భద్రంగా ఉంటుందా ? అని చర్చించుకుంటున్నారు.అన్నీ మండలాల్లోనూ సమగ్రంగా దర్యాప్తు జరిపితే మరింత అవినీతి దందా వెలుగు చూసే అవకాశం ఉంది.

కందుకూరు గడ్డ.. పేకాటకు అడ్డా!

- రేయింబవళ్లు జోరుగా జూదం
- మాలకొండ, రామాయపట్నం పరిసరాల్లో శిబిరాలు
- చేతులు మారుతున్న రూ.కోట్ల నగదు
- పేకాటరాయుళ్లకు పోలీసుల దీవెనలు?

కందుకూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గం పేకాటకు అడ్డాగా మారిపోతోంది. గత కొన్ని నెలలుగా పగటివేళల్లో మాలకొండ పరిసరాల్లోని అటవీప్రాంతంలోను, రాత్రి పది దాటాక తెల్లవారే వరకు రామాయపట్నం పరిసర ప్రాంతాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. కందుకూరు పరిసరాల్లోని పేకాట రాయుళ్లతోపాటు నెల్లూరు, ఒంగోలు, కావలి, పామూరు తదితర పట్టణాలు, చెన్నై ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు కార్లలో తరలివస్తున్నారు. ఒకేసారి 30, 40 మంది ఆటలో పాల్గొనేలా కోసు (కోతముక్క) పద్ధతిలో జరిగే ఆటలో నిమిషాల్లోనే లక్షలాది రూపాయలు చేతులు మారతాయి. ప్రతిరోజు కనీసం కోటి రూపాయలకు తక్కువ కాకుండా చేతులు మారుతుండగా నిర్వాహకులు అందులో పదిశాతం వరకు లబ్ధి పొందుతూ రూ.2 లక్షల వరకూ మామూళ్లరూపంలో ముట్టజెబుతుండటం విశేషం. తెట్టు నుంచి రామాయపట్నం వెళ్లేమార్గంలో ఇందుకోసమే నిర్మించిన ఓ ప్రత్యేక అతిథిగృహంలో బాహాటంగా ఈ పేకాట జరుగుతోంది. ఈ అతిథి గృహంలోనే కాకుండా ఆయా పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాలకు, మరికొన్ని సందర్భాలలో ఉలవపాడు పరిసర ప్రాంతాలకు ఈ శిబిరాలను మారుస్తుంటారు. ఇటీవల ఈ పేకాటలో రూ.3 కోట్లకుపైగా పోగొట్టుకున్న ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి తన స్వీయగాథను వినిపిస్తూ సోషల్ మీడియాలో పెట్టడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నెలరోజుల క్రితం గుడ్లూరు మండలం పరకొండపాడు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రాత్రంతా పేకాటలో పాల్గొని కారులో తిరిగివస్తూ మద్యం మత్తులో ఓ చెట్టును ఢీకొనగా ఒకరు మృతి చెందారు. ఈ కేసును కూడా పోలీసులు పేకాట ప్రస్తావన రాకుండా తారుమారు చేయడం విశేషం.



ఉలవపాడు సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద పేకాటరాయుళ్ల కార్లు ఇవి

● ఆంధ్రజ్యోతి పరిశీలనలో...

రాత్రిపూట జరుగుతున్న పేకాట శిబిరాల గుర్తింపు కోసం సోమవారం అర్ధరాత్రి ఆంధ్రజ్యోతి ప్రత్యేక పరిశీలన చేయగా ఉలవపాడు సమీపంలోనే పేకాట శిబిరం నడుస్తూ కనిపించింది. జాతీయ రహదారి పక్కనే ఓ పెట్రోలుబంకు సమీపంలో పదికిపైగా కార్లు ఒకేచోట ఆపి ఉండగా అనుమానంతో ఆ పరిసరాల్లో గాలించగా పేకాట శిబిరానికి సెంట్రీ డ్యూటీ చేస్తున్న వ్యక్తులు కనిపించారు. దీంతో తక్షణం ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మకు సమాచారం ఇవ్వగా ఆయన ఓ కారులో వచ్చి కొద్దిసేపు జాతీయ రహదారిపై గాలించి అనంతరం పేకాట శిబిరం సమీపానికి చేరుకోగా సెంట్రీ డ్యూటీ చేస్తున్న వారు మాత్రమే ఆయనకు పట్టుబడగా అసలైన పేకాట రాయుళ్లు తప్పించుకుని వెళ్లిపోయారు. అయితే పెట్రోలుబంకు సమీపంలో ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. కాగా నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.2200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ప్రకటించటం విశేషం. ఈ విషయమై ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మను ప్రశ్నించగా సోమవారం రాత్రి ఉలవపాడు సమీపంలో పేకాటశిబిరం నడిచిన మాట వాస్తవమని అన్నారు. అయితే అర్ధరాత్రి తనకు సమాచారం వచ్చే సమయానికి తాను, డ్రైవర్ మాత్రమే ఉన్నామని హడావిడిగా ఇద్దరం ఘటనా స్థలానికి వెళ్లినా ఇద్దరం అంతమందిని పట్టుకోలేమని ఓ కీలక మార్గంలో కాపుకాసినట్లు తెలిపారు. తొలుత పట్టుబడ్డ ముగ్గుర్ని స్టేషన్‌కి తీసుకెళ్లి మళ్లీ వచ్చేసరికి మరో వ్యక్తి బైక్‌లో ఆయిల్ అయిపోయి దొరికాడని వివరించారు. ఈలోగా మరో ఇద్దరు సిబ్బందిని పిలిపించుకుని గాలించామని, పెట్రోలుబంకు వద్ద ఉన్న కార్లకు పంక్చర్లు పెట్టి ఉదయాన్నే హైకోర్టు డ్యూటీ ఉండటంతో వెళ్లినట్లు వివరించారు. కార్ల ఆధారంగా పేకాటరాయుళ్లను విచారిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

● జిల్లా ఎస్పీకి ఫిర్యాదు

కందుకూరు ప్రాంతంలో జోరుగా పేకాట జరుగుతున్న వైనం, స్థానిక పోలీసు అధికారులంతా మామూళ్లమత్తులో తూలుతుండటంపై ఎస్పీకి కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఆ తర్వాత నుంచి పోలీసుల సూచనల మేరకు పేకాటరాయుళ్ల స్థావరాలను మార్చి ఈ వ్యవహారాన్ని కొనసాగిస్తుండటం గమనార్హం. ఈ పేకాటల నిర్వహణలో క్రియాశీలంగా ఉన్న వ్యక్తి రాజకీయ ప్రముఖుల పేర్లను ఉటంకిస్తుండటం కేవలం పోలీసు శాఖకు కలంకమే గాక ప్రభుత్వ ప్రతిష్ఠను కూడా దిగజార్చేలా ఉన్నందున ఈ శిబిరాలపై ఉక్కుపాదం మోపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

29న 'రాయభారం'

బుచ్చిరెడ్డిపాళెం: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు, రైతులు పండించిన ధాన్యం గిట్టుబాటు ధర కోసం ఈనెల 29న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద నిర్వహించే రాయ భారం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా రైతాంగం పార్టీలకతీతంగా తరలిరావాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాథం పిలుపునిచ్చారు. మంగళవారం బుచ్చిలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.20,136 మద్దతు ధర ప్రకటిస్తే మిల్లర్లు మాత్రం రైతుల నుంచి 15000 నుంచి 16 వేల లోపే ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సురేష్, లక్ష్మయ్య, మౌలయ్య పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు

● స్కానింగ్ కేంద్రాలకు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత హెచ్చరిక

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత హెచ్చరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం జిల్లాస్థాయి సలహా సంఘం సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు స్కానింగ్‌కు సిపార్సు చేయరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయి సలహా సంఘం చైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ లింగ నిష్పత్తి బాలురు 1000 మంది ఉండగా బాలికలు 1011 మంది ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ స్వర్ణలతారెడ్డి, డాక్టర్ కరీముల్లా, డీఐవో డాక్టర్ ఉమా మహేశ్వరి, శివశంకర్‌రావు, డెమో కనకరత్నం, ఎన్జీవో కవితరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేశ్ విగ్రహాల నిర్వహణ సింగిల్ విండో సిస్టం నిబంధనలకు లోబడి ఉండాలని, అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని విగ్రహాల నిర్వహణ కమిటీలను సీఐ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రతిచోట ఎస్‌ఓసీలు, క్యూఆర్‌కోడ్‌ల ప్రకారం నిబంధనలు పాటించాలని తెలిపారు. డీజేలు, అశ్లీల డ్యాన్సులు, మద్యం సేవించి బైక్‌రేస్‌లు చేయడం, అల్లర్లు లాంటి సమస్యలు తలెత్తితే నిర్వాహకులు బాధ్యతని పేర్కొన్నారు.

కావలిలో చిచ్చు పెడితే ఊరుకోం!

● మాజీ మంత్రి కాకాణిపై ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఫైర్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న కావలి నియోజక వర్గంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చిచ్చు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నెల్లూరులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 83 రోజులు జైలులో ఉన్న కాకాణి కావలికి వచ్చి ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. గత పదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్ కుమార్‌రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కావలిని గంజాయికి కేంద్రంగా మార్చి, తన అనుచరుల ద్వారా వీటి అమ్మకాలు సాగించారని ఆరోపించారు. కావలిలో రూ.70 కోట్ల మనీస్కామ్ జరిగిందని, ఇందులో రామిరెడ్డికి సంబంధం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకుని బ్లూ మెటల్ క్వారీని నడుపుతున్నట్లు చెప్పారు. 2023లో టీడీపీ అభ్యర్థి అవుతానని తెలిసిన రోజునే ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో క్వారీపై దాడులు జరిగాయన్నారు. చట్ట విరుద్ధంగా రూ.143 కోట్లు పెనాల్టీ విధించారని చెప్పారు. హైకోర్టు తలుపులు తట్టగానే ప్రభుత్వం తల దించుకుని క్వారీకి క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతాప్‌రెడ్డి కల్యాణమండపం, ఇల్లు, ఇంజనీరింగ్ కళాశాల ఆక్రమణతో నడుస్తు న్నాయని విమర్శించారు. డ్రోన్ సహాయంతో బెంగళూరు నుంచి రౌడీలను తీసుకు వచ్చి తన ఆచూకీ కనిపెట్టాలని రామి రెడ్డి పర్యవేక్షించారన్నారు. ఈ సమా వేశంలో టీడీపీ నేతలు పమిడి రవి కుమార్ చౌదరి, బీద గిరిధర్, అలేఖ్య, హనుమంతరావు, బండి శ్రీని వాసులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

మత్స్యకారుడి మృతి

ఇందుకూరుపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైపాడు పడమటిపాలెంకు చెందిన ఊటుకూరు ఆదిశేషయ్య(45) మరో నలుగురు మత్స్యకారులతో కలిసి మంగళ వారం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వేట సమయంలో ఆదిశేషయ్యకు గుండెపోటు రావడంతో తోటి మత్స్యకారులు ఒడ్డుకు చేర్చి దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. డాక్టర్ వైద్య పరీక్షలు నిర్వహించి మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కావలిరూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని ముసునూరు టోల్‌గేట్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు... బోగోలు మండలం పాత బిట్రగుంటకు చెందిన కందుకూరి రాగేశ్వరరావు(68) పూల వ్యాపారంతో పాటు ఆలయాల్లో పూల డెకరేషన్ చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో కావలి పట్టణంలోని ఓ ఆలయంలో పూల డెకరేషన్ చేసేందుకు సోమవారం రాత్రి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అక్కడి నుంచి మోటారు బైక్‌పై తమ గ్రామానికి వెళ్తుండగా టోల్‌గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన రాగేశ్వరరావును చికిత్స నిమిత్తం 108 వాహనంలో పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతుడి భార్య పరమేశ్వరి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్‌ఐ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేగంగా సోమేశ్వరాలయ పునర్‌నిర్మాణ పనులు

అనంతసాగరం ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భారీవరదలకు సోమశిల వద్ద ఉన్న సోమేశ్వరుడి ఆలయం ధ్వంసమైన విషయం తెలిసిందే. అయితే గతంలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపింది. దేవదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆలయానికి పూర్వవైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఆదిశగా అనతికాలంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దేవదాయశాఖ నుంచి రూ. 8 కోట్లు మంజూరు చేయడంతో ప్రస్తుతం శరవేగంగా పనులు జరుగుతున్నాయి.మొత్తం గ్రానైట్‌రాళ్లతో పనులు చేస్తున్నారు. చెన్నైకి చెందిన ఆలయాల నిర్మాణ నిపుణులతో పనులు చేయిస్తున్నారు. ఆలయంలోని మూలవిరాట్‌ను అలాగే ఉంచి, మిగతా కట్టడాలన్నీ తొలగించి పూర్వం ఎలా ఉండో అలాగే నిర్మిస్తున్నారు.



జరుగుతున్న ఆలయ పునర్‌నిర్మాణ పనులు

పరిపాలన విభాగాన్ని వేధిస్తున్న సిబ్బంది కొరత!

- 8 మందికి ఒక్కరే విధుల్లో..
- పనులు సాగేదెలా?
- ఇది కావలి ఏరియా వైద్యశాలలో పరిస్థితి
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

కావలి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా వైద్య శాల పరిపాలనా విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడ మొ త్తం 8మంది సిబ్బందికి గాను ఒకే ఒక్కరు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వైద్యశాలలో పరిపాలనా విభాగంకు చెందిన అత్యవసర పనులన్నీ నిలచిపోతు న్నాయి. వాస్తవానికి పరిపాలనా విభాగంలో ఒక అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, ఒక సూపరింటెండెంట్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటరీ ఆపరేటర్లు, ఒక జూనియర్ అకౌంటెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఉండాలి. కేవలం ఒక ఆఫీస్ సూరింటెండెంట్ మాత్రమే ఉన్నారు. అలాగే ఎక్స్‌రే విభాగంలో ముగ్గురు డార్క్ రూము సహాయకులు ఉం డాల్సి ఉండగా ఒక్కరు కూడాలేరు. దీంతో సిబ్బంది కొరతతో పరిపాలనా విభాగంలో అన్ని పనులు స్తంభించి పోతున్నాయి. శాలరీ బిల్లులు, హెడ్‌ఆఫీస్ నుంచి వచ్చిన మెయిల్స్‌కు సకాలంలో సమాచారం ఇవ్వడం తదితర సేవలకు ఇబ్బందికరంగా ఉం టుంది, ఏదైనా మీటింగ్‌కు వెళ్లితే ఆరోజు కార్యక్రమాలన్నీ పూర్తిగా ఆగిపోతున్నాయి. హెచ్‌డీఎస్, షాపింగ్ రూములు, నేష నల్ హెల్త్ మిషన్ బడ్జెట్‌లు తదితరాల లావాదేవీలన్నీ నిలిచిపోతు న్నాయి. అలాగే బాలింతలకు జనరిక్ సురక్షిత స్కీం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నవారికి ఇచ్చే పారితోషకం తదితరాల లావాదేవీలన్నీ పరిపాలన విభాగం నుంచి జరగాల్సి ఉంది. అయితే 8 మందికిగాను ఒకే ఒక్కరు విధులలో ఉండడంతో పరిపాలనా విభాగం సేవలు పూర్తిగా స్తంభించి పోతుండటంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

● ఎక్స్‌రే ప్లాంట్‌లో ఒకే ఒక్కరు..

ఎక్స్‌రే రూములో ఒక ఉద్యోగితో పాటు ముగ్గురు డార్క్‌రూము సహాయకులు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేనందున ఎక్స్‌రేలు తీయడానికి ఇబ్బందికరంగా ఉంది. ఉన్న ఒకే ఒక ఎక్స్‌రే తీసే వ్యక్తి 24 గంటలు అందుబాటులో ఉండటం సాధ్యం కానందున ప్రమాదాలకు గురై ఆసుపత్రికి వచ్చిన వారికి ఎక్స్‌రేలు తీయాలంటే అర్ధరాత్రి సమయంలో ప్రైవేట్ ఎక్స్‌రేల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. జాతీయ రహదారి పక్కన ఏరియా వైద్యశాల ఉండటంతో ప్రమాదాలకు గురైన వ్యక్తులకు సహాయకులు కూడా లేకుండా వస్తున్నందున అలాంటి సమయంలో బయటకు పంపి ఎక్స్‌రేలు తీసేందుకు కూడా అవకాశం లేక వ్యాధి నిర్ధారణలు తెలియక వైద్యసేవలు అందించటం కూడా ఇబ్బందికరంగా మారుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఏరియా వైద్యశాలలో సిబ్బంది కొరత లేకుండా తగు చర్యలు తీసుకుని సేవలకు ఆటంకాలు కలగకుండా చూడాల్సి ఉంది.



కావలి ఏరియా వైద్యశాల భవనం